ప్రజాశక్తి

ఆదివారం 31 డిసెంబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఒంగోలు, గిద్దలూరుపైనే ఉత్కంఠ

- రెండు చోట్లా అభ్యర్థుల ఎంపికే సంక్లిష్టం
- జనవరి 2 తర్వాతే కొత్త సమన్వయకర్తల జాబితా





ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపిలో అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రాలేదు. ఎవరెక్కడనే దానిపై పూర్తిస్థాయి అవగాహనకు రాలేకపోయారు. మరో రెండు, మూడు రోజులు పడుతుందని సమాచారం. వైసిపి అభ్యర్థుల ఎంపికపై రెండు రోజుల పాటు తాడేపల్లిలో వాడివేడిగా చర్చలు నడిచాయి. మాజీ మంత్రి బాలినేనితో పాటు ఇతర నేతలతో పార్టీ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి చర్చలు నడిపారు. ఎవరిని ఎక్కడ పెట్టాలనే దానిపై అన్ని కోణాల్లో ఉత్కంఠభరితంగా చర్చలు జరిగాయి. జాబితాపై పూర్తిస్థాయిలో స్పష్టతకు రాలేకపోయారు. ఇంకా తర్జన భర్జనలు నడుస్తున్నాయి. జిల్లా నేతలూ తాడేపల్లిలోనే రెండు రోజుల పాటు గడిపారు. టిక్కెట్టు కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇప్పటికీ ఆశావహులు ఎవరియత్నాల్లో వాళ్ళున్నారు. అయితే ప్రధానంగా ఒంగోలు, గిద్దలూరు అసెంబ్లీ స్థానాలపైనే అందరి దృష్టి ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థులపై కొంత స్పష్టత రావాల్సి ఉంది. ఇక్కడే భారీ మార్పులకు అవకాశాలు కనిపిస్తున్నాయి. గిద్దలూరులో ఎమ్మెల్యే అన్నా రాంబాబు పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అక్కడ కొత్త అభ్యర్థిని రంగంలోకి దించాల్సిందే. అయితే అక్కడ ఎవరన్న దానిపై సర్వేలు, ఇతర ప్రాధాన్యతలపై అధిష్టానం ఇప్పటికే చర్చ నడిపింది. గిద్దలూరులో మాజీ మంత్రి బాలినేనిని పోటీ చేయాలని అధిష్టానం ప్రతిపాదించింది. ఒంగోలులో మాజీ మంత్రి శిద్దా రాఘవరావును పోటీ చేయాలని పార్టీ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ప్రతిపాదించారు. అయితే మాజీ మంత్రి శిద్దా మాత్రం ఒంగోలులో పోటీకి ససేమిరా అంటున్నారు. దీంతో ఈ రెండు స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక సంక్లిష్టంగా మారింది. మాజీ మంత్రి శిద్దా నిర్ణయంపైనే ఈ రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థులపై స్పష్టత రానుంది. ఒంగోలులో పోటీకి శిద్దా అంగీకరిస్తే గిద్దలూరులో బాలినేని అభ్యర్థి అవుతారు. ఆయన అంగీకరించకపోతే మాత్రం బాలినేని ఒంగోలులోనే ఎప్పటిలాగా పోటీ చేయడం ఖాయం. ఇలా ఈ రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థులపై ఉత్కంఠ కొనసాగుతోంది. అధిష్టానం సూచనలపై బాలినేని కూడా మెత్తబడ్డారు. అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా మాజీ మంత్రి శిద్దాను కూడా ఒప్పించే యత్నం ▶ 2లో

మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతం

- పోటీ కార్మికులను రంగంలోకి దింపుతున్న అధికారులు
- అడ్డుకుంటున్న కార్మికులు
- ఐదో రోజు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన



ఒంగోలులో పోటీ కార్మికులను అడ్డుకుంటున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

తమ సమస్యల పరిష్కారం కోసం ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఉధృతంగా కొనసాగుతోంది. కార్మికుల సమ్మెతో నగరంలో పారిశుధ్యం లోపించింది. వీధుల వెంట చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాలు నిలిచిపోయాయి. కార్మికుల సమ్మె నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు పోటి కార్మికులను రంగంలోకి దింపారు. నగరంలోని పలు పారిశుధ్య డివిజన్ లలో పోటీ కార్మికులతో పని చేయించేందుకు అధికారులు ప్రయత్నించగా పారిశుధ్య కార్మికులు వారిని అడ్డుకున్నారు. పోలీసు పహారాలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలను కార్మికులు పలుచోట్ల తిప్పకొట్టారు.

ఐదోరోజు సమ్మెలో భాగంగా కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. సమ్మె కార్యక్రమాన్ని సిఐటియు నగర ఉపాధ్యక్షులు దామా శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. కార్మికులను రెగ్యులర్ చేయకుండా ప్రభుత్వాలు వివక్ష ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురాం సమ్మెకు మద్దతు తెలిపారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎస్‌డి హుస్సేన్, ఏ శ్రీనివాసరావు, మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు కె.గోపి, యు.రత్నకు మారి, ఇ.విజయమ్మ, కె.వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీనివాసరావు, కె.బాలకృష్ణ, శ్రీలక్ష్మి, కె కమల, బి దివ్య, ఎం లక్ష్మీకాంతం, కోటేశ్వరి పాల్గొన్నారు.



చీమకుర్తిలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పోటీ కార్మికుల అడ్డగింత

చీమకుర్తి: పోటీ కార్మికులతో పారిశుధ్య పనులు చేయించాలని ప్రయత్నించిన పోలీసులను, మున్సిపల్ అధికారులను సమ్మె చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసి పోటీ కార్మికులతో పనులు చేయించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్‌కె.ఫజులుల్లా, పోలీసుల సహకారంతో శనివారం రాత్రి 8 గంటల సమయంలో బస్టాండ్ సెంటర్‌లో చెత్త కుప్పలను తొలగించడానికి ప్రయత్నించారు. అయితే విషయం తెలుసుకున్న పారిశుధ్య కార్మికులు మున్సిపల్ అధికారులను, పోలీసులను, పోటీ కార్మికులను అడ్డుకున్నారు. ఇద్దరి మధ్య ▶ 2లో

పట్టు వదలకుండా పోరాటం

- మంత్రి ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీలు
- సర్వశిక్ష ఉద్యోగుల నిరసనలు



మార్కాపురంలో మంత్రి సురేష్ ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, బాపట్ల

సిఎం జగన్ ఇచ్చిన హామీల అమలు కోసం చేపట్టిన సమ్మెలు కొనసాగుతున్నాయి. రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం కనిపించడం లేదు. పైగా మంత్రులు, ఎమ్మెల్యేలు మాటలతో ఉద్యోగులపై ఎదురుదాడులు చేస్తున్నారు. సమ్మెను పరిష్కరించాలనే ఆలోచన కనిపించడం లేదు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సమ్మె కారణంగా ఎవరికీ ఇబ్బందులు రాకుండా చూడాలని రాష్ట్రప్రభుత్వం ఆయా శాఖలకు ఆదేశాలు ఇచ్చింది.

మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా కూడా ఏ పనులూ ఆగకుండా ఉండేందుకు పోటీ కార్మికులతో అధికారులు పనులు చేయించేందుకు సిద్ధమయ్యారు. మున్సిపల్ ప్రాంతాల్లో ట్యాంకర్లు, చెత్తవాహనాలను బయటవ్యక్తులతో నడిపించేందుకు ప్రయత్నాలు చేస్తుండగా ఉద్యోగులు అడ్డుకుంటున్నారు. రోడ్లపైనే వాటిని అడ్డుకొని ధర్నాలు చేస్తున్నారు. అధికారుల తీరును తప్పుపడుతున్నారు. మున్సిపల్ ఉద్యోగుల సమ్మె కారణంగా అన్ని కార్యకలాపాలు స్తంభించిపోయాయి. చెత్తసేకరణ ఆగిపోయింది. వీధులు కంపుకొడుతున్నాయి. నగరాల్లో చెత్త పేరుకుపోతోంది. సమ్మెను పరిష్కరించాలని జనం కూడా కోరుతున్నారు. ఇక అంగన్‌వాడీలు సమ్మెను తీవ్రతరం చేశారు. ఇప్పటికే 19 రోజులు గడిచింది. ఎలాంటి స్పందన లేదు. పైగా వైసిపి ఎమ్మెల్యేలు అంగన్‌వాడీలపై పరుషంగా వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తున్నారు. మార్కాపురంలో మంత్రి ఆదిమూలపు సురేష్ ఇంటిని అంగన్‌వాడీలు పెద్దఎత్తున ముట్టడించారు. ఒంగోలులోనూ మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. జిల్లాలో పలుచోట్ల అంగన్‌వాడీలు వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద సర్వశిక్ష ఉద్యోగుల దీక్షలు కొనసాగుతున్నాయి. సమ్మెలకు వివిధ సంఘాలు, పార్టీలు సంఘీభావం ప్రకటిస్తున్నాయి. వైసిపి నేతలకు మాత్రం పట్టడంలేదు.



వంటావార్పుతో నిరసన తెలుపుతున్న సమగ్ర ఉద్యోగులు

అర్హులందరికీ ఇళ్లు పంపిణీ చేస్తాం..

- రాబోయేది టిడిపి ప్రభుత్వమే..
- పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్



టిడ్కో ఇళ్ల వద్ద మహిళలతో సెల్ఫీ దిగుతున్న జనార్ధన్

8లో ▲

ఒక్క పనీ చేయడం లేదెందుకు?

కౌన్సిల్ సమావేశంలో నిలదీసిన అధికార పార్టీ కౌన్సిలర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో అధికార పక్షం గరంగరంగా ఉంటోంది. పలువురు అధికార పార్టీ కౌన్సిలర్లే సమావేశాలకు గైర్హాజరవుతున్నారు. సమావేశాలకు అరకొరగా వస్తున్న అధికార వైసిపికి చెందిన కౌన్సిలర్లు ప్రతిపక్షంలా వ్యవహరిస్తున్నారు. కారణం తమతమ వార్డుల్లో పనులు కావడం లేదనే ఆవేదనతో చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, కమిషనర్ బిఎస్ గిరికుమార్, ఇతర అధికారులపై విరుచుకుపడుతున్నారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం స్థానిక పొట్టి శ్రీరాములు కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షతన జరిగింది. చైర్మన్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో రెండున్నర సంవత్సరాల కాలంలో అభివృద్ధి 60 శాతం జరిగిందని చెప్పారు. వైసిపికి చెందిన 8వ వార్డు కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమ వార్డులో పైప్‌లైన్ నిర్మించాలని ఆరు నెలలుగా కోరినా ఫలితం లేదన్నారు. తమ వార్డులో ఒక్క పని చేయలేదన్నారు. తమ వార్డుపై వివక్ష ఎందుకని నిలదీశారు. తాను ఆ వార్డు కౌన్సిలర్‌ను కాదంటే చెప్పండి... సమావేశాలకు కూడా రానని చెప్పారు. సమస్యలపై తాను మాట్లాడటమే కానీ... తమ వార్డులో ఏ సమస్యకూ పరిష్కారం చూపలేదని ధ్వజమెత్తారు. నివాసాలు లేని ప్రాంతంలో పైప్‌లైన్ నిర్మాణం జరుగుతోందన్నారు. ఎవరి స్వార్థం ఎంత ఉందో దీన్నిబట్టి తెలుస్తోందన్నారు. అధికార పార్టీకి చెందిన 7వ



ధ్వజమెత్తిన అధికార పార్టీ కౌన్సిలర్ భాగ్యలక్ష్మి

వార్డు కౌన్సిలర్ కొత్త వీరవెంకటకృష్ణ కూడా సమస్యలపై పాలకులను, అధికారులను నిలదీశారు. మార్కాపురం పట్టణంలో అడ్డదిడ్డంగా బంకులు పెడుతున్నారన్నారు. 32వ వార్డు కౌన్సిలర్ షేక్ చిన్న షెక్షావలి మాట్లాడారు. తమ వార్డులో విద్యుత్ స్తంభాల సమస్య నేటికీ తీరలేదన్నారు. పైప్‌లైన్ వేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి, సయ్యద్ అబిదా ఖాశిం, పఠాన్ అమీరుల్లాఖాన్, పలువురు కౌన్సిలర్లు, డిఇ షేక్ సుభానీ, టిపిఒ కె శ్రీనివాసులు, మేనేజర్ ఎస్ శ్రీనివాసన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్, రెవెన్యూ అధికారి బి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-పెద్దారవీడు

స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్న్‌షిప్‌పై వర్క్‌షాప్ నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం వర్క్‌షాప్ కార్యక్రమానికి కళాశాల నుంచి రిసోర్స్ పర్సన్స్‌గా పి మనోహర్, ఎ అమృతవల్లి వ్యవహరించి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రాముఖ్యతను వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యత తదితరాలపై వివరించామని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌నకు ఏపీ మోడల్ స్కూల్ మిట్టమీదపల్లి 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి కృష్ణారెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ రంగనాయకులు, కళాశాల ఏఓ బి ప్రభాకర్, వివిధ విభాగపు అధిపతులు డాక్టర్ జెవి అనిల్‌కుమార్, పి రామ్మోహన్, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పివి అనిల్‌కుమార్, కె రాముడు, కె కిషోర్‌బాబు, ఏపీ మోడల్ స్కూల్ మిట్టమీదపల్లి, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, నేషనల్ ట్రైనర్ బాషా, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

కొంత తోపులాట జరిగింది. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో కార్మికులు ధర్నా చేశారు. చేసేది లేక పోలీసులు, అధికారులు వెనుదిరిగారు. శనివారం అర్ధరాత్రి పోటీ కార్మికులను తీసుకొచ్చి పోలీసుల సహకారంతో చెత్త తొలగించేయందుకు మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తారనే సమాచారంతో, సమ్మెలో ఉన్న కార్మికులు రాత్రి కూడా కాపలా కాస్తున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, నాయకులు పూసపాటి వెంకటరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఇట్టా నాగయ్య, నాయకులు ఏడుకొండలు, యోసోబు, పద్మ, నరసయ్య, కోటేశ్వరరావు, కళ్యాణి, చెన్నమ్మ, కోటేశ్వరి, దాసు, సురేఖ పాల్గొన్నారు.

ఒంగోలు, గిద్దలూరుపైనే ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. ఇప్పటికీ ఎలాంటి కొత్త పరిణామాలు కనిపించడం లేదు. ఇక బాలినేని విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లారు. అక్కడ నుంచే అభ్యర్థుల వ్యవహారాలపై దృష్టి సారించారు. మిగతా నియోజకవర్గాల్లో అభ్యర్థులు దాదాపుగా ఖరారైనా ఈ రెండు నియోజకవర్గాలు కొలిక్కి వస్తేనే అన్నీ కలిపి ప్రకటించనున్నారు. ఇక దర్శిలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైపాలెంలో తాటిపర్తి చంద్రశేఖర్, మార్కాపురం, కనిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తిరిగి టిక్కెట్లు దాదాపుగా ఖరారైనట్లే. ఇప్పుడు వీటిపై చర్చ లేదు. ఇక మార్పులు, చేర్పుల్లో జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలకు టిక్కెట్లు లేకుండా పోయాయి. వీరి భవితవ్యం ఏమిటనేదీ చూడాలి. ఇప్పటికే పార్టీపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు తన వైఖరిని ఈపాటికే ప్రకటించారు. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి, సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబుల రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ సమావేశం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు మండలంలోని రాచకొండ గ్రామంలో సర్డ్ సంస్థ ఆధ్వర్యంలో విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ సమావేశం నిర్వహించారు. 18 సంవత్సరాల లోపు వయసు ఉన్న బాలబాలికలకు ప్రొటెక్షన్ రక్షణ కవచనం లాగా పని చేస్తుందన్నారు. బాలబాలికల భవిష్యత్తుకు భరోసాగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు చేయకూడదన్నారు. అలా చేస్తే ఇరువర్గాల వారిపై చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలు చేయడం మూలంగా అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని బాల్య వివాహాలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజిరెడ్డి, సర్డ్ సంస్థ ఏపిఎం మరియబాబు, సిఏఫ్‌సి ధర్మానాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీల అమలులో జగన్ విఫలం: ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 99.5 శాతం హామీలు అమలు చేశానని ప్రతి సభలో పదేపదే అబద్దాలు చెబుతూ సొంత డబ్బా కొట్టుకుంటున్నారని టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ధ్వజమెత్తారు. శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మేనిఫెస్టోలో చెప్పిన దానికన్నా అదనంగా చేసింది నిజమని అన్నారు. అందుకే నేడు అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు నాయుడుకు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వం మాత్రం 730 హామీలిచ్చి 109 మాత్రమే అమలు చేసిందని ఎద్దేవా చేశారు. ఇలా అబద్ధపు హామీలిచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు జగన్మోహన్‌రెడ్డి గొంతు కోశారని చెప్పారు. 2 లక్షల 30 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తానని మాట తప్పినట్లు వివరించారు. అంగన్‌వాడీలకు తెలంగాణ రాష్ట్రం కన్నా రూ.1000 అదనంగా పెంచుతామన్న హామీపై మడమతిప్పి వారిని రోడ్డుపైకి నెట్టాడని ఆరోపించారు. మద్యనిషేధం చేసి ఓటు అడుగుతానన్న హామీకి విరుద్ధంగా మద్యం ఆదాయం 15 ఏళ్ల బ్యాంకులకు తాకట్టు పెట్టాడని ఎద్దేవా చేశారు. విద్యుత్ చార్జీలు పెంచననే హామీకి విరుద్ధంగా రూ.64 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపాడని తెలిపారు. సిపిఎస్ రద్దు, రైతు రుణమాఫీ, మద్య నిషేధం, అమరావతి అభివృద్ధి, ఇసుక అక్రమ తరలింపు, నివారణ లాంటి అనేక హామీలపై మాటతప్పి మడమ తిప్పారని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వేములకొండ శ్రీనివాస్, టిడిపి మండల కన్వీనర్లు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాద్, టిడిపి నాయకులు షేక్ మస్తాన్‌వలి, కంచర్ల సత్యనారాయణ గౌడ్, దొంతా వెంకట్రావు, నక్కా రాములు, చెవుల అంజయ్య, గోవిందు, వేగినాటి శ్రీనివాస్, కిశోర్, కోటయ్య, లక్ష్మయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని ముట్టడించిన కార్మికులు

ప్రజాశక్తి-మార్కాపురం

సిఎం జగన్ ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరుతూ ఎపి మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు రోజులుగా సమ్మె జరుగుతోంది. అందులో భాగంగా మార్కాపురం మున్సిపాలిటీలోని కాంట్రాక్ట్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో కొనసాగుతున్నారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా కార్మికులంతా కలిసికట్టుగా వెళ్లి కౌన్సిల్ సమావేశాన్ని ముట్టడించారు. నినాదాలు చేశారు. దీంతో చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ కౌన్సిల్ సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించాల్సి వచ్చింది. కార్మికులతో చిర్లంచెర్ల మాట్లాడారు. విధుల్లో చేరాలని కోరారు. న్యాయంగా తాము చేస్తున్న పనికి ఇస్తున్న వేతనం తక్కువన్నారు. రెగ్యులర్ చేస్తామని చెప్పారని, తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ ద్వారా సిఎం జగన్‌కు తమ డిమాండ్లకు మద్దతు తెలుపుతూ లేఖను పంపాలని కోరారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల (సిఐటియు అనుబంధం) జిల్లా అధ్యక్షులు కొండబోయిన సుబ్బరాయుడు, మార్కాపురం మున్సిపల్ యూనియన్ సెక్రటరీ గొట్టం హరికృష్ణ, ఎస్‌కె ఇమామ్ సాహెబ్, చెల్లి వెంకటసుబ్బయ్య, గురునాథం, అల్లూరయ్య, చిలకా నాగయ్య, రషీద్ బాషా తదితరులు ఈ ధర్నా కార్యక్రమానికి నాయకత్వం వహించారు. కెవిపిఎస్ నాయకులు కొండేటి నగేష్ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన సంఘీభావం తెలియజేశారు.

ఉన్ని దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మానసిక వికలాంగులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్ తిరుమలాదేవి అన్నారు. శనివారం ఆమె తన పుట్టినరోజు సందర్భంగా యర్రగొండపాలెం పట్టణంలోని మాచర్ల రోడ్డులో ఉన్న సన్‌జో సేవాలయంలో ఆశ్రయం పొందుతున్న 21 మంది మానసిక వికలాంగులకు రూ.ఏడు వేల విలువ గల ఉన్ని దుస్తులు (చలికోట్లు) పంపిణీ చేశారు. అలాగే పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకున్నారు. తిరుమలాదేవి మాట్లాడుతూ మానసిక వికలాంగులను మానవతా దృక్పథంతో చూడాలన్నారు. గుమ్మా రాజయ్య, నియోజకవర్గ అధ్యక్షులు పోలేపల్లి పెద్ద పాలంకయ్య, కెజిబివి జువాలజీ లెక్చరర్ అంజలి పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అఘాయిత్యం కేసులో..

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

కన్ను మిన్ను కానక 65 సంవత్సరాల వృద్ధురాలిపై అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితుడు కమల్‌నాథ్‌ను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. మార్కాపురం మండలం రాయవరం గ్రామానికి చెందిన వృద్ధురాలిపై గురువారం అర్ధరాత్రి స్థానికంగా నివసించే యువకుడు అత్యంత అమానుషంగా అత్యాచారానికి పాల్పడ్డారు. తీవ్రమైన రక్తస్రావం అవుతుండడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బాధిత వృద్ధురాలిని శుక్రవారం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించడంతో ఘటన గురించి సమాచారం అందుకున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా బృందం శనివారం మార్కాపురానికి చేరుకొని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఆ అగంతకుడి క్రూరమైన చర్యలకు ఆ వృద్ధ మహిళ ఒళ్ళంతా గాయాలయ్యాయని కన్నీటి పర్యంతమయ్యారు. మద్యం మత్తులో ఎలా ప్రవర్తిస్తున్నాడో కూడా తెలియకుండా నాలుగు గంటలు అత్యంత క్రూరంగా వాడి ప్రవర్తన సాగిందని బాధితురాలు ఆవేదనతో తమకు చెప్పారని అన్నారు. చనిపోయిందన్న నిర్ధారణకు వచ్చి వృద్ధురాలిని వదిలేసి వెళ్లిపోయారని బాధితురాలు తెలిపినట్లు చెప్పారు. ఈ అత్యాచార ఘటనకు పాల్పడింది ఒక్కడేనా, ఇంకా ఎవరైనా



బాధితురాలిని పరామర్శిస్తున్న ఐద్వా బృందం

ఉన్నారా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టాలన్నారు. ఘటన జరిగిన వెంటనే బాధితురాలు ఇచ్చిన సమాచారంతో నిందితుడు కమల్ నాథ్‌ను అరెస్టు చేయటం మంచి విషయమైనా కఠిన శిక్షలు పడే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పదేపదే జరగటానికి కారణమైన మద్యపానాన్ని నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఎన్నికలకు ముందుగా నేటి ముఖ్యమంత్రి తాము అధికారంలోకి వస్తే దశలవారీగా సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తామని ఇచ్చిన వాగ్దానం నేటికీ నెరవేరలేదని అన్నారు. మద్యంతోపాటు ఈ కాలంలో మత్తు పదార్థాల వినియోగం కూడా విపరీతంగా పెరిగిందని, ఇవి మహిళలపై అరాచకాలు, అత్యాచారాలు, హింస పెరిగేందుకు దారితీస్తున్నాయని ఆమె అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని, మద్యం, మత్తు పదార్థాల నిషేధానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అత్యాచారానికి గురైన మహిళ వితంతువు అని, ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ మీదనే ఆధారపడి జీవిస్తున్నదని తెలిపారు. ఆమెకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మార్కాపురం పట్టణ కార్యదర్శి డి శారా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గుమ్మా బాలనాగయ్య, ఐద్వా నాయకులు పి దేవమణి, కె బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అత్యాచార నిందితుడు

మార్కాపురం: మార్కాపురం మండలంలోని రాయవరం రైల్వే స్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న ఓ వృద్ధురాలిపై అత్యాచారం జరిగిన సంగతి పాఠకులకు తెలిసిందే. ప్రజాశక్తిలో వెలువడిన కథనంపై పోలీసులు స్పందించారు. మార్కాపురం డిఎస్‌పి జి వీరరాఘవరెడ్డి, సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, మార్కాపురం రూరల్ ఎస్ఐ ఎం వెంకటేశ్వరనాయక్‌లు విచారణ చేపట్టారు. అత్యాచారానికి పాల్పడిన దేవండ్ల కమల్‌నాథ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మార్కాపురం రూరల్ ఎస్ఐ ఎం వెంకటేశ్వరనాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రగిరిలో బ్యారన్ దగ్ధం

- రూ.5 లక్షలు నష్టం

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం చంద్రగిరిలో గంగిరెడ్డి పెద్ద గురవారెడ్డికి చెందిన బ్యారెన్‌ను అద్దెకు తీసుకుని విఠలాపురం గ్రామానికి చెందిన మాగులూరి సురేంద్ర, మోహన్‌రావు సాగు చేస్తున్నారు. శనివారం ప్రమాదశాత్తు ఒక ట్రైరు విరిగి పొయ్యి మీద పడటంతో బ్యారెన్ దగ్ధమైంది. అందులో 7 క్వింటాళ్లకు పైగా పొగాకు రూ.2 లక్షలు, బ్యారెన్ రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. మొత్తం రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి-పొదిలి: స్థానిక దర్శి రోడ్డులో ఎస్‌వీకేపి డిగ్రీ కళాశాల సమీపంలో హైదరాబాద్ నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్‌లో అక్రమంగా తరలిస్తున్న ఆరు తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను పొదిలి సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వస్తున్న ప్రైవేటు, ఆర్టీసి బస్సుల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులకు ఒక ప్రైవేటు బస్సులో మద్యం తీసుకువస్తున్న వారి వద్ద నుంచి బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపిన సెబ్ అధికారులు తెలిపారు. పొదిలి సర్కిల్ పరిధిలో అక్రమ మద్యం బాటిళ్ళ ఎవరైనా తరలించినా, నిల్వ ఉంచినా తమకు తెలియజేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

క్రైమ్ కాలమ్

షార్ట్ సర్క్యూట్‌తో ఆటోమొబైల్ షాప్ దగ్ధం

ప్రజాశక్తి-బేస్తవారిపేట

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆటో మొబైల్ షాప్ పూర్తిగా దగ్ధమైన సంఘటన బేస్తవారిపేట జంక్షన్‌లో జరిగింది. ఒంగోలు నుంచి గిద్దలూరు వెళ్లే రోడ్డులో పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. చెట్టిచర్ల గ్రామానికి చెందిన శివ అనే వ్యక్తి గత 14 సంవత్సరాలుగా ఆటో మొబైల్ షాప్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఆటోమొబైల్ షాప్ మొత్తం తగలబడి పోయింది. ప్రమాదం జరిగిన సమయంలో షాపులోని మొత్తం వస్తువులన్నీ దగ్ధమైపోయాయి. ఈ ప్రమాదంలో షాపు యజమానికి సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు మంటలు పూర్తిగా షాప్‌ను చుట్టుముట్టడంతో పూర్తిగా దగ్ధమైపోయింది. జీవనోపాధి కోల్పోయిన తనను ప్రభుత్వపరంగా ఏదైనా ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

ప్రజాశక్తి-మార్కాపురం

పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు ఆర్ తిరుపతిరెడ్డి(42) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివారం ఉదయం దేవరాజుగట్టులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షల నిర్వహణ కారణంగా డ్యూటీ వేశారు. అక్కడ విధుల్లో పాల్గొన్న తిరుపతిరెడ్డి ఉదయం 9 గంటల సమయంలో గుండెనొప్పి వచ్చిందని తోటి ఉద్యోగితో చెప్పారు. అక్కడ నుంచి మార్కాపురంలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించి చికిత్స ప్రారంభించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో ఒంగోలుకు తరలించేందుకు అంబులెన్స్‌ను సిద్ధం చేశారు. అంబులెన్స్‌లోకి తిరుపతిరెడ్డి నడుచుకుంటూనే వెళ్లాడు. ఇంతలో మరోమారు గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. పరీక్షించిన వైద్యులు తిరుపతిరెడ్డి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మార్కాపురం డిఎస్‌పి జి వీరరాఘవరెడ్డి, సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, పెద్దారవీడు ఎస్ఐ రాజ్‌కుమార్, తోటి పోలీసు సిబ్బంది పలువురు తిరుపతిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.



తిరుపతిరెడ్డి (ఫైల్)

కాలువలో పడి చిన్నారి మృతి

ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు ● రామాపురంలో విషాదం

ప్రజాశక్తి-చీరాల

పండగ వేళలో ఆ ఇంట విషాదం నెలకొంది. తప్పటడుగులు ఏస్తూ అప్పటిదాకా ఆడుకున్న చిన్నారి కాలుజారి కాలువలో పడడంతో నీటిలోకి జారిపోయాడు. విషయం గమనించని కుటుంబ సభ్యులు చిన్నారి కోసం ఊరంతా గాలిస్తూ వెతుకులాట ప్రారంభిం చారు. అయితే ఎక్కడా ఆచూకీ తెలియక పోవడంతో చిన్నారి ఆడుకుంటున్న కాలువ వద్దకు వెళ్లి చూడగా నీటిలో తేలాడుతూ కనిపించడంతో తల్లిదండ్రులు అక్కడే కుప్పకూలిపోయారు. ఈ ఘటన వేటపాలెం మండలం రామాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రామాపురం గ్రామానికి చెందిన వాయుల రాంబాబు, లక్ష్మి దంపతుల ముగ్గురు సంతానం. మొదట ఇద్దరు మౌనిత కుమారి, అమృత ఆడపిల్లల అనంతరం వాయుల మారుతీ రామ్(2) పుట్టాడు. అయితే రోజు లాగే తన తాత జాలయ్యతో సముద్రపు ఒడ్డున చేపలు ఎండబెడుతుండగా సరదాగా ఆడుకునేందుకు మారుతీ రామ్ అక్కడికి వెళ్లాడు. అయితే



మారుతీరాం (ఫైల్)

తాతయ్య తల్లిదండ్రుల వద్దకు వెళ్లమని మందలించాడు. మనవడు వెళ్లిపోయాడు అనుకుని జాలయ్య తన పనిలో నిమగ్నమయ్యాడు. పని ముగించుకొని జాలయ్య ఇంటికి వెళ్లేసరికి మనవడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులను జాలయ్య ఆరా తీశాడు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు తమ వద్దకు రాలేదని చెప్పటంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు ఊరంతా గాలించారు. అయితే ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో చివరికి కాలువ వద్దకు వెళ్లి చూడగా అక్కడ బాలుడు శవమై నీటిలో తేలియాడుతూ కనిపించాడు. దీంతో తల్లిదండ్రులు కొన ఊపిరితో ఉన్నాడనుకొని పరుగులు తీసి చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్య పరీక్షలు చేసిన వైద్యులు చిన్నారి ఆ పాటికే మృతి చెందినట్లు వివరించడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదిస్తూ తల్లడిల్లిపోయారు. సమాచారం అందుకున్న ఈపూరిపాలెం ఎస్ఐ జనార్ధన్ వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనతో రామాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బిజెపిని ఓడించడమే ప్రధాన లక్ష్యం కావాలి: జాలా

ప్రజాశక్తి-పామూరు

కేంద్రంలో మతోన్మాద బిజెపిని రాబోయే ఎన్నికల్లో ఇంటికి పంపేందుకు యువత ముందుకు రావాలని సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య పిలుపునిచ్చారు. శనివారం సిపిఎం సిఎస్ పురం పామూరు మండల కార్యకర్తల శిక్షణ తరగతులు తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడుదారులకు లాభాలు చేకూర్చి పేదలపై భారాల మోపుతోందని విమర్శించారు. గత ఎన్నికల్లో ప్రజలకు అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రెచ్చగొడుతోందని, దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఎన్నికలలో



మాట్లాడుతున్న జాలా అంజయ్య

హామీ ఇచ్చి గెలిచిన తర్వాత యువతను మోసం చేసిందన్నారు. విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని ఆరోపించారు. జీఎస్టీ పేరుతో ప్రజల వద్ద అధిక లాభాలు పొందుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై తీవ్ర భారాలు మోపుతోందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కొమ్ముకాస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పామూరు మండల కార్యదర్శి కే మాల్యాద్రి, సిఎస్ పురం, పామూరు మండల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గిద్దలూరు సిఐటియు ఆధ్వర్యంలో 5వ రోజు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు గిద్దలూరు మండల కార్యదర్శి బండా నర్సింహులు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆరోగ్యం సరిగా లేనప్పుడు జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలని, కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, మృతుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి శ్రీనివాసులు, మున్సిపల్ పారిశుధ్య కార్మిక యూనియన్ నాయకులు జి నాగయ్య, మురళి, పాపయ్య, సుందర్‌రావు, వెంకటయ్య, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మస్తాన్‌రెడ్డి, వెంకట్రావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చిల్లచెట్ల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-పెద్దారవీడు

స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాల రహదారి చిల్లచెట్లతో అధ్వాన్నంగా తయారయింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ సమస్యను స్థానిక సర్పంచి దుగ్గెం చెన్నమ్మ దృష్టికి తీసుకొని రావడంతో వెంటనే సర్పంచ్ స్పందించి రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదేశాల మేరకు రహదారికి ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించారు. పెద్దారవీడు మండల యువజన విభాగం అధ్యక్షులు దుగ్గెం దినేష్, పెద్దారవీడు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, రహదారి వద్దకు వెళ్లి పూర్తి స్థాయిలో రహదారిని జెసిబి సహాయంతో శుభ్రం చేయించారు. దీంతో పాటు ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలు చెత్తాచెదారం రోడ్డుకు ఇరువైపులా వేస్తున్నారని పంచాయతీ కార్యదర్శి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించి అక్కడ ఉన్న ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా దూర ప్రాంతంలో ఉన్న గుంతలలో చెత్తను వేసుకోవాలన్నారు. పెద్దారవీడు గ్రామ ప్రజలు సర్పంచికి అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండలం జిల్లాలపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న షేక్ కరిముల్లా(56) శనివారం తెల్లవారుజామున కనిగిరిలోని శ్రీతీ ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఈయన దాదాపుగా 25 ఏళ్ల నుంచి ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గ్రామంలో ప్రజలను మన్ననలు పొందారు. ఈయన మృతికి మండలంలోని ఉపాధ్యాయులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు. సంతాపం తెలిపినవారిలో ఉపాధ్యాయులు పివిఎన్ రవికుమార్, హరిబాబు, ప్రజాశక్తి విలేఖరి షేక్ మస్తాన్‌షరీఫ్ తదితరులున్నారు.

జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-రేపల్లె: కోడి పందేలు పేకాట నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై అబ్దుల్ రజాక్ హెచ్చరించారు. మండలంలోని రజుకాల్వ గ్రామ పొలాలలో కోడి పందాలు వేస్తున్న ముగ్గురు వ్యక్తులని ఒక కోడిపుంజు రూ.960/- స్వాధీనం చేస్తున్నామని అలాగే..గంగాడపాలెం పంచాయతీలోని మత్యుంజయ వారిపాలెం లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.700/- జూదరులను అదుపులోనికి తీసుకున్నట్లు చెప్పారు.


ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపిపి వై యలమంద

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సంతమాగులూరు

ప్రజాశక్తి దినపత్రిక 2024క్యాలెండర్‌ను ఎంపీపీ వై ఎలమంద, ఎంఇఒలు వేమవరపు కోటేశ్వరరావు, దార్ల దినేష్ కుమార్ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఓర్సు కొండలు, జెఎంజె ఆంజనేయులు, వైసీపీ నాయకులు మోదేపల్లి శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ సుబ్బారెడ్డి, ఎఒ మంగతాయార్, అబ్రహం పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సభ్యునిగా ఆర్య

ప్రజాశక్తి - బాపట్ల రూరల్


రాష్ట్ర కమిటి సభ్యులు ఆర్య

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 26 నుంచి 29 వరకు కాకినాడ పట్టణంలో నిర్వహించారు. మహాసభల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 400మంది ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు. తనను రాష్ట్ర కమిటీలోకి మూడోసారి తీసుకోవడంపట్ల తనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు.


బాపట్లలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్షలు

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - బాపట్ల

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారం కు 11వ రోజుకు చేరింది. కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద సమ్మె శిబిరంలో మహిళా ఉద్యోగులు పొర్లు దండాలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిచాలని కోరారు. సమ్మెకు ఎన్జీఒ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరావు, కార్య దర్శి ఇస్సాక్, కోశాధికారి రాయుడు, సమగ్ర శిక్ష జిల్లా నాయకులు మాణిక్యరావు, రమేష్, జాన్ వెస్లీ, సాయి ప్రసాద్, అశోక్, రత్న కుమారి, జయశ్రీ పాల్గొన్నారు.


వేతనాలు ఇవ్వాలని పంచాయితీ కార్మికుల బిక్షాటన

పంచాయతీ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

పంచాయితీ పారిశుద్ధ కార్మికులు తమకు పెండింగులో ఉన్న వేతనాలు ఇవ్వాలని 8రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారు. జీతాలు ఇవ్వాలని కోరుతున్నా వారి మొర ఎవ్వరూ ఆలకించడంలేదు. పండగపూట కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు లేక కార్మికుల కుటుంబాలు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. నాలుగు నెలల నుండి జీతాలు ఇవ్వలేదని చెబుతున్నారు. పంచాయితీ అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా పారిశుధ్య కార్మికులు శనివారం భిక్షాటన చేపట్టారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు జీతాలు ఇవ్వాలని సిఐటియు కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు డిమాండ్ చేశారు.

ప్రభుత్వం దిగిరాకుంటే పోరు ఉధృతం


అద్దంకిలో అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా విజయకుమార్


చుండూరులో అంగన్‌వాడీలతో వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి - బాపట్ల

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ 19రోజులుగా అనేక రూపాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం కనికరించకపోతే పోరును ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె శిబిరం నుండి పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద మానవహారంగా తమ నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెకు సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, బీసీ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు శైలశ్రీ, హేమమాలిని, లత, గీత, కుమారి పాల్గొన్నారు.

పంగులూరు : న్యాయమైన కోర్కెల సాధన కోసం గత 18రోజుల నుండి నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల పోరాటానికి కాంగ్రెస్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం మద్దతు తెలిపారు.

రేపల్లె : అంగన్‌వాడీ కార్యకర్తలు తమ డిమాండ్స్ పరిష్కారం చేయాలని ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. జనసేన అధ్యక్షులు ఆర్ మహేష్, రేపల్లె జానకి, దేవగిరి శంకర్, సీఐటీయు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మంత్రుల ఇళ్ళను ముట్టడిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి కె వాణి, నాయకులు ఎన్ కృష్ణకుమారి, నిర్మల, జ్యోతి, శివలక్ష్మి, రజిని, దీప్తి విజయలక్ష్మి, సిఐటియు నాయకులు జె ధర్మరాజు, బి అగస్టిన్ పాల్గొన్నారు.

అద్దంకి : జగన్ ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలను అన్ని రకాల అణగదొక్కేందుకే ప్రయత్నిస్తుందని సిఐటియు నాయకురాలు జి శారద అన్నారు. స్థానిక తహాశీల్దారు కార్యాలయం వద్ద దీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీల సమ్మెకు ప్రజాశక్తి ఇన్‌ఛార్జి బి విజయకుమార్ మద్దతు ప్రకటించారు. సిఐటియు నాయకురాలు జి శారద, అనిత ధన లక్ష్మి, సుబ్బాయమ్మ, కళావతి, పూర్ణ పాల్గొన్నారు.

చుండూరు : అంగన్‌వాడీ కార్యకర్తల దీక్షా భిశిరాన్ని వైసిపి ఇన్ఛార్జి వరికూటి అశోక్ బాబు సందర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్స్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతానని చెప్పారు. దీక్షకు విరామం ప్రకటించి విధులలో చేరాలని కోరారు.

సంతమాగులూరు : అంగన్‌వాడీల మానవహారం నిర్వహించి తమ నిరసన తెలిపారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు సంఫీుభావం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మస్తాన్ బి, శ్రీదేవి, ఎస్తేరా రాణి, నిర్మల, ఆదెమ్మ, రమణ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : అంగన్‌వాడీల దీక్షా శిభిరం నుండి పంచాయితీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పంచాయితీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కోటా శ్రీనివాసరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమాదేవి, సూర్యలక్ష్మి, గృహలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయకులు పి మనోజ్ పాల్గొన్నారు.

కొల్లూరు : అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె శిబిరం నుండి గ్రోమోర్, శివాలయం సెంటర్ మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వెనుకనున్న మహాత్మా గాంధీ విగ్రహానికి అంగన్‌వాడీ కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు, సెక్టార్ లీడర్స్ వనజ, బాలకాశి, భాగ్యం, సౌభాగ్య లక్ష్మి పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : మండలంలోరని దుద్దుకూరు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మోకాళ్ళపై కూర్చొని, చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. గ్రామ పెద్దలు శిబిరంలో ఉన్న కార్యకర్తలకు మంచినీరు, శీతల పానీయాలు అందజేశారు. మాజీ జడ్పిటిసి వీరగంధం ఆంజనేయులు అంగన్‌వాడి కార్యకర్తలకు అరటి పళ్ళు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి నాగండ్ల వెంకటరావు, ప్రాజెక్టు లీడర్ దేవమణి, సరళ, శ్రీదేవి, పి హేమలత, కే పద్మ, ఎస్ బుల్లమ్మాయి, ఎస్‌కె కరీమున్నీసా, అన్నమ్మ, కోమలి, అనిత, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

చీరాల : సచివాలయ ఉద్యోగులు అంగన్‌వాడీల పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్లు నడవడానికి రావద్దని, ఉద్యోగుల మధ్య ఐక్యత కావాలని కోరుతూ నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులకు అర్జీలు ఇచ్చారు. స్థానిక తహాశీల్దారు కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పి రేఖ, పి ప్రమీల, ఎ బ్యూలా, సులోచన, శిరీష, దుర్గ పాల్గొన్నారు.

నగరం : అంగన్‌వాడి సేవలను ఇతరులకు అప్పగిస్తే ఊరుకునేది లేదని తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె రత్నకుమారి, రాజ్యలక్ష్మి, కృష్ణకుమారి, జ్యోతి, నళిని పాల్గొన్నారు.



కొల్లూరులో గాంధీ విగ్రహానికి విన్నవిస్తున్న అంగన్‌వాడీలు


రేపల్లెలో అంగన్‌వాడీలకు జనసేన నేతల మద్దతు

నల్ల దుస్తులతో కార్మికుల నిరసన


నల్లదుస్తులతో మున్సిపల్ పారిశుద్య కార్మికుల నిరసన ధర్నా

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మె శనివారంకు 5వ రోజు స్థానిక మున్సిపల్ కార్మికులు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. పారిశుధ్య కార్మికులు చేస్తున్న పోరాటానికి చేతివృత్తిదారుల సమన్యాయ కమిటీ నాయకులు మద్దతు తెలిపారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్ బాబురావు, చేతివృత్తి దాసురుల సమన్వాయ కమిటీ జిల్లా కన్వీనర్ పి కొండయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఒకవైపు కార్మిక సంఘాలతో చర్చలు జరుపుతూనే మరోవైపున పోటీ కార్మికులు తెచ్చి పని చేయించాలని కమిషనర్లపై ఒత్తిడి చేసి కార్మికులను బెదిరించటం సరైన చర్య కాదని అన్నారు. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా కార్మికులపై బెదిరింపు చర్యలు హేయమైన చర్యని అన్నారు. కార్మికులకు ఇవ్వవలసిన సమాన పనికి సమాన వేతనం, పర్మినెంట్, సంక్షేమ పథకాల అమలు తదితర డిమాండ్లు పరిష్కారం చేయాలని కోరారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు నూతలపాటి రాజు, కార్యదర్శి ఎండ్లూరు సింగయ్య, కోశాధికారి మానికల శంకర్, బడుగు కుమారి, బి విజయమ్మ, తిరుపతమ్మ, యశోద, సుబ్బమ్మ, ఆంజనేయులు, రేణుమాల నసాగరాజు, గూడూరు శిరీష, పద్మ పాల్గొన్నారు.

అద్దంకి : పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు పి తిరుపతిరెడ్డి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు 5వ రోజు వంట వార్పుతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ జగన్ సిఎం అయిన తరువాత కార్మికుల సమస్యలు అధికమయ్యాయని అన్నారు. గతంలో ఇచ్చిన హామీలను జగన్ నిలబెట్టుకోవాలని అన్నారు. కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె శిభిరం వద్దనే వంట చేసుకుని రోడ్డుపైనే భోజనాలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, కార్మికులు పి ఆదాం, భీష్మ, అంజమ్మ పాల్గొన్నారు.


అద్దంకిలో ధర్నా శిభిరం వద్దనే వంట చేసుకుని నిరసనలో కార్మికులు

డిఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - యద్దనపూడి



రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎస్‌పి

స్థానిక పోలీసు స్టేషన్‌ను బాపట్ల డిఎస్‌పి వెంకటేశులు శనివారం ఆఖస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడాలని అన్నారు. రికార్థులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలనలో మార్టూరు సిఐ అక్కేశ్వరరావు, యద్దనపూడి ఎస్ఐ నాగ శ్రీను, పర్చూరు ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

'రోటరీ' ఆంజనేయులు తల్లి మృతి

ప్రజాశక్తి - పంగులూరు


జి నాగేంద్రమ్మ (95)

రోటరీ క్లబ్ కోశాధికారి గుర్రం ఆంజనేయులు తల్లి గుర్రం నాగేంద్రమ్మ (95) శనివారం ఉదయం మరణించారు. వృద్ధాప్యం వల్ల వచ్చిన అనారోగ్యంతో ఆమె మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగేంద్రమ్మ ఏకైక కుమారుడు గుర్రం ఆంజనేయులు సిపిఎం పార్టీలో చాలాకాలం పనిచేశారు. తరువాత రోటరీ క్లబ్ అధ్యక్షునిగా పనిచేశారు. ప్రస్తుతం క్లబ్ కోశాధికారిగా కొనసాగుతున్నారు. మృతదేహాన్ని సిపిఎం రాష్ట్ర నాయకులు నాగబోయిన రంగారావు, జిల్లా నాయకులు రాయిని వినోద్ బాబు, జడ్పిటిసి రాయిని ప్రమీల, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయిని వెంకటసుబ్బారావు, రిటైర్డ్ సైంటిస్ట్ రాయిని రామారావు సందర్శించి నివాళులు అర్పించారు.

ఉధృతంగా అంగన్‌వాడీల ఆందోళన

మంత్రి సురేష్ ఇల్లు ముట్టడి

అడ్డుకోబోయిన పోలీసులు.. తోపులాట

ప్రజాశక్తి-మార్కాపురం

అంగన్‌వాడీల సమ్మె ఉధృతంగా సాగుతోంది. ప్రభుత్వం స్పందించకపోవడంతో అంగన్‌వాడీలు కూడా ఆందోళన తీవ్రతరం చేశారు. శనివారం మార్కాపురంలోని మునిసిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు మంత్రి సురేష్ ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీలు మాత్రం లెక్కచేయకుండా తమ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వందలాదిగా ఆందోళనలో పాల్గొన్నారు. ముందుగానే మంత్రి సురేష్ ఇంటి గేటు బంద్ చేశారు. లోపల మంత్రి పిఎ మాత్రమే ఉన్నారు. కనీసం మంత్రి పిఎకైనా తమ డిమాండ్లను తెలియజేయాలని నిర్ణయించుకున్నారు. మంత్రి పిఎను కూడా కలుసుకునేందుకు పోలీసులు అనుమతించలేదు. దీంతో ఓపిక నశించిన అంగన్‌వాడీలు గేట్లు తెరుచుకొని ఇంట్లోకి గుంపులుగా చేరుకున్నారు. డిఎస్పీ జి వీరరాఘవరెడ్డి, సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, మార్కాపురం పట్టణ ఎస్ఐ, రూరల్ ఎస్ఐలు పి కోటేశ్వరరావు, ఎం వెంకటేశ్వరనాయక్‌లు తమ సిబ్బందితో పలువురు మహిళా పోలీసులతో ఆందోళనకారులను అడ్డగించారు. తప్పని పరిస్థితుల్లో మంత్రి పిఎ ఆందోళనకారుల వద్దకు రావాల్సి వచ్చింది. వేతనాలు పెంచాలని, గత ఎన్నికల ముందు సిఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి పిఎకు అందజేశారు. అంగన్‌వాడీలను ఉద్దేశించి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు ఈదర అన్నపూర్ణ మాట్లాడారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం రమేష్, నాయకులు డికెఎం రఫీ, పి రూబెన్, జవ్వాజి రాజు, డి సోమయ్య, ఏనుగుల సురేష్‌కుమార్ తదితరులు వీరికి మద్దతుగా నిలిచారు.

మంత్రి ఆదిమూలపు సురేష్ క్యాంప్ ఆఫీస్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం ఒంగోలులో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ క్యాంప్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. స్థానిక కలెక్టరేట్ వద్ద నుంచి అంగన్‌వాడీ వర్కర్స్ నెల్లూరు బస్టాండ్, డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూలు మీదుగా మంత్రి క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి యూనియన్ నాయకులు పి ప్రశాంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్స్ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గత 19 రోజుల నుంచి రోడ్లపైకి వచ్చి నిరవధిక సమ్మె చేస్తుంటే మహిళలనే కనికరం కూడా లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒకవైపు వాళ్ల సమస్యలు పరిష్కరించకుండా సాక్షి, సోషల్ మీడియాలో అంగన్వాడీ వర్కర్స్‌కు రూ.26,000 పెంచామని, అబద్ధాలతో ఉద్యమాన్ని చీల్చే పద్ధతిలో చూస్తున్నారన్నారు. వైసిపి మంత్రులు ఈ ప్రచారాన్ని ఆపాలని, రానున్న రోజుల్లో దినపత్రికలో వచ్చిన విషయమై బహిరంగ చర్చలకు పిలుస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి అంగన్వాడీ వర్కర్స్



ఒంగోలులో మంత్రి సురేష్ క్యాంప్ ఆఫీసును ముట్టడించిన అంగన్‌వాడీ కార్యకర్తలు

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు కెవి సుబ్బమ్మ, పి కల్పన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు పోరాటం చేస్తుంటే అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు అసభ్య పదజాలంతో మహిళలనే కనికరం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసులు, బంకా సుబ్బారావు, పి ఆంజనేయులు, టంగుటూరు రాము, సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి మహేష్, యూనియన్ జిల్లా నాయకులు కె ధనలక్ష్మి, జయప్రద, ఎమీమా, సిహెచ్ జ్యోతి, పద్మ, నిర్మల, క్రాంతి, హేమలత, శేషమ్మ, కెవిపిఎస్ జిల్లా నాయకులు వి మోజెస్ పాల్గొన్నారు.

దర్శి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించలేని ఈ అసమర్థ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రైతు సంఘం దర్శి డివిజన్ కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 19 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా నిరాహార దీక్షలు కొనసాగించి అనంతరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బరత్నం, విశ్వవాణి, లక్ష్మీ, వెంకటరమణ, బాలమ్మ, నాగమణి, సుజాత, నాగమల్లేశ్వరి, ఉక్కు మోహన్‌రావు, ఈమని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: వెలిగండ్ల అంగన్‌వాడీ ప్రాజెక్టు వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో 19వ రోజు వెలిగండ్ల, సిఎస్ పురం, హెచ్‌ఎం పాడు మండలాల పరిధిలో గ్రామ సచివాలయాల వద్ద పిల్లల తల్లిదండ్రులతో ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం సచివాలయ కేంద్రాలలో అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు, ఎక్కంటి రాధమ్మ, కార్యదర్శి ముక్కు మహాలక్ష్మమ్మ, సెక్టార్ లీడర్లు గొర్రెముచ్చు సలోమి, రెడ్డెం తిరుపతమ్మ, సిహెచ్ రఫీయా, అన్నెబోయిన పెద్దక్క, ఆదిలక్ష్మమ్మ, దమ్ము పద్మావతి, సోము వెంకటశ్రీలక్ష్మి, నాగేంద్రమ్మ, నారాయణమ్మ, బిజ్జం విజయలక్ష్మి, పాపబత్తిన ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిఎస్ పురం రూరల్: అంగన్వాడీల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని యుటిఎఫ్ సీనియర్ నాయకుడు వి సాంబశివరావు అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం సిఎస్ పురం సచివాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 19 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోగా వారి పట్ల చిన్నచూపు చూడడం తగదన్నారు. ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వం మెడలు వంచి తమ డిమాండ్లను సాధించుకునేంత వరకు అంగన్వాడీలు తమ ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. అంగన్వాడీల ఉద్యమానికి యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అంగన్వాడీల ఉద్యమానికి సంఘీభావంగా యుటిఎఫ్ సేకరించిన సంఘీభావనిధి రూ.5,000 అంగన్వాడీలకు అందజేశారు. అంగన్వాడీలు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల నాయకులు సిహెచ్ రఫియా, అనురాధ, వెంకట లక్ష్మమ్మ, నారాయణమ్మ, పెద్దక్క, మాధవి, జి నారాయణమ్మ, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె వెంకట్రావు, షేక్ పాదుషా, నాగినేని తిరుపతయ్య, మానం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల బైఠాయింపు

ప్రజాశక్తి-కనిగిరి



ఎమ్మెల్యే 'బుర్ర' దౌర్జన్యం నశించాలని నిరసన

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న నాయకులపై ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ దౌర్జన్యం నశించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిసి కేశవరావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఎస్ఐ తీరును నిరసిస్తూ కనిగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించి సర్కిల్ కార్యాలయం ఎదుట బైఠాయించి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిసి కేశవరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే నోటి దురుసుతనం తగ్గించుకోవాలని సూచించారు. మహిళలను దుర్భాషలాడిన ఎస్ఐని ఉన్నతాధికారులు విచారించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం ఆగదని తెలియజేశారు. పోరాట నాయకులపై దౌర్జన్యంగా వ్యవహరించే తీరు పునరావృతం అయితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్ సుజాత, సీత, రాజేశ్వరి, రజిని, భాగ్యలక్ష్మి, సౌందర్య, రామసుబ్బులు, డివైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, ఐద్వా నాయకులు ఎస్‌కే బషీర, ప్రసన్న పాల్గొన్నారు.

సునీతకు 'సాహిత్య సేవా రత్న' పురస్కారం

ప్రజాశక్తి-బల్లికురవ



కవయిత్రి, రచయిత గంగవరపు సునీతకు 'సాహిత్య సేవా రత్న' పురస్కారం లభించింది. ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ వారు రెండు తెలుగు రాష్ట్రాలలో వివిధ కళల్లో రాణించిన వారికి 2023వ సంవత్సరానికి గాను జాతీయ సాహితీ కళా సేవా పురస్కారాలను ప్రకటించారు. ఇందులో భాగంగా సాహిత్య సేవా రంగంలో విశేష కృషి చేసిన వారికి ఇచ్చే 'సాహిత్య సేవా రత్న' పురస్కారం గంగవరపు సునీతకు లభించింది. ఈ అవార్డులను ఈ నెల 28వ తేదీ హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో అందించారు. అదేవిధంగా ఇటీవల చినుకు కల్చరల్ సొసైటీ వారు నిర్వహించిన పాటల రచన పోటీలో కూడా సునీత ఉత్తమ ప్రతిభ కనపరిచి పలువురి ప్రశంసలు పొందారు. రెండు కవితా సంపుటిలు ప్రచురించి, మరో పుస్తక ప్రచురణకు సిద్ధపడుతున్న సునీత కవితలు, కథలు అనేకం వివిధ పత్రికల్లో ప్రచురితమవుతున్నాయి. బాపట్ల జిల్లా బల్లికురవ జడ్‌పి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గంగవరపు సునీత సాహిత్య కృషిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ డిఎస్‌పి విక్రమ శ్రీనివాసరావు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ శ్రీనివాసరావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, కార్మికుల పక్షాన నిలిచే పత్రిక ప్రజాశక్తి అని పేర్కొన్నారు.



వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎంపిడిఒ శ్రీనివాసమూర్తి

కంటి వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్లలో ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్యశాలను శనివారం ఎంపిడిఒ అద్దంకి శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనకనమిట్ల, మార్కాపురం, తర్లుపాడు, దొనకొండ, పొదిలి ప్రాంతాల్లోని వారు వైద్య పరీక్షలు చేయించుకోవచ్చునన్నారు. అనంతరం వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్‌వి బాలయ్య, ఎంపిటిసి కళ్లం దిబ్బారెడ్డి, డాక్టర్ విశాక్ పద్మకుమార్, కేంద్ర అడ్మినిస్ట్రేషన్ కె మేష్, విషన్ సెంటర్ కో ఆర్డినేటర్ కె దేవయ్య, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ ప్రేమసాగర్, ఆప్టికల్ పర్సన్ వందన, టెక్నీషియన్ మల్లేష్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎం, ఎంవీఐ తనిఖీలు

ప్రజాశక్తి-దర్శి

పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ సుందరరావు దర్శి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌లు స్థానిక దర్శిలోని అద్దంకి రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్యాక్స్‌లు కట్టకుండా అక్రమంగా నడుపుతున్న మూడు ఆటోలను సీజ్ చేసినట్లు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. అదే విధంగా మొత్తం 10 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ట్యాక్స్ కట్టకుండా రోడ్లమీద తిరిగితే బండ్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వైసీపి ఎమ్మెల్యే టికెట్ స్థానికులకే ఇవ్వాలి

ప్రజాశక్తి-రాచర్ల

గిద్దలూరు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే టికెట్ స్థానిక నాయకులకే ఇవ్వాలని వైసిపి రాచర్ల మండల నాయకులు, కార్యకర్తలు కోరారు. వారు శనివారం రాచర్లలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు జఫ్రుల్లాఖాన్ మాట్లాడుతూ వైసీపీ అధిష్టానం స్థానిక నాయకులకు కాకుండా స్థానికేతరులకు టికెట్టు కేటాయిస్తూ గిద్దలూరు అభివృద్ధికి ఆటంకంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులకు టికెట్ ఇవ్వడం వల్ల గిద్దలూరు నియోజకవర్గం అభివద్ధి చెందుతుందని ఈ విషయాన్ని అధిష్టానం దష్టిలో ఉంచుకొని స్థానికులకు టికెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. గతంలో పగడాల రామయ్య, పిడతల కుటుంబ సభ్యులు ,తదితరులు స్థానికంగా విజయం సాధించారనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని అన్నారు.

ముత్తుముల సమక్షంలో టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో రాచర్ల మండలం అనుమలపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సిరిగిరి వెంకటపతి ఆధ్వర్యంలో 13 బీసీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి టీడీపీ కండువా కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గంలో అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపిని వీడిన కావేటి పెద్ద గురువయ్య, వెంకటరంగయ్య, పుల్లయ్య, నారాయణ, పెద్దన్న, గురునాథం, గురుప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

నూతన సంవత్సర వేడుకలను అప్రమత్తతో, జాగ్రత్తతో, అవగాహనతో బాధ్యతాయుతంగా జరుపుకోవాలని మార్కాపురం డిఎస్పి జి వీరరాఘవరెడ్డి సూచించారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మధ్యరాత్రి ఒంటి గంట వరకు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై శనివారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణంలో మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మార్కాపురం డిఎస్‌పి జి వీరరాఘవరెడ్డి మాట్లాడుతూ యువత నూతన సంవత్సర వేడుకల్లో హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత ఏడాది జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కొత్త సంవత్సరంలో అంతా మంచే జరగాలని కోరుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుసుకోవాలి తప్ప వేడుకల పేర్లతో శాంతి భద్రతలకు వివాదం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లను మార్చినా, రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, రేసింగ్‌కు పాల్పడితే ఎంవి యాక్ట్ 183,184 కింద కేసులు నమోదు చేస్తామని అన్నారు. తమ పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పక ఉండాలన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు ఫ్యామిలీ రెస్టారెంట్లు యజమానులు వారికి కేటాయించిన సమయంలోపే తెరిచి ఉంచాలని సూచించారు. అలా కాదని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని డిఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో శిక్షణ డిఎస్‌పి గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఎస్ఓ షేక్ షహబాస్ అహ్మద్, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ, గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు ఎం సువర్ణ, ఎం వెంకటేశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం చేస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి హనిమిరెడ్డి

హనిమిరెడ్డి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పంగులూరు

స్థానిక అంబేద్కర్ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి బోల్లా వీరాంజనేయులు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఇంట్లోని టీవీ, ఫ్యాను, 15బస్తాల ధాన్యంతో పాటు సామాను మొత్తం అగ్నికి ఆహుతి అయ్యాయి. కుటుంబం కట్టుబట్టలతో ప్రాణాల అరిచేతిలో పెట్టుకొని బయట పడ్డారు. రూ.లక్షపైగా ఆస్తి నష్టం జరిగింది. వైసిపి ఇంచార్జ్ హనిమిరెడ్డి శనివారం రాత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బివి కృష్ణారెడ్డి, ఎస్ హనుమంతరావు, చక్రవరం భాస్కరరాజు, తూర్పు కొప్పరపాడు సొసైటీ అధ్యక్షులు నాగేశ్వరరావు, బాచిన ఆంజనేయులు, గాదె బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి సహకరిస్తా

ప్రజాశక్తి - పంగులూరు

గ్రామీణ ప్రాంతంలో జరిగే క్రీడల్లో ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులు ఉంటారని, అలాంటి వారిని ప్రోత్సహిస్తే ఉత్తమ క్రీడాకారులుగా తయారవుతారని వైసిపి ఇన్చార్జి పానెం హనిమిరెడ్డి అన్నారు. మండలంలోని కొండ మంజులూరు గ్రామంలో జరుగుతున్న రెండు తెలుగు రాష్ట్రాల కబడ్డీ పోటీల ముగింపు సందర్భంగా గెలుపొందిన విజేతలకు శనివారం బహుమతి ప్రదానం చేశారు. తాను తమిళనాడు బ్యాడ్మింటన్ టీం మేనేజర్‌గా ఉన్నట్లు తెలిపారు. కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల కబడ్డీ పోటీల్లో ప్రకాశం జట్టు మొదటి స్థానం సాధించింది. సైకిల్ జట్టు ద్వితీయ స్థానం, సామర్లకోట జట్టు తృతీయ, చిన్నగంజాం జట్టు నాలుగు, కెఎల్ యూనివర్శిటీ ఐదో స్థానంలో నిలిచాయి.

బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని నాగండ్ల గ్రామంలో ఆడుదాం ఆంధ్ర ముగింపు సందర్భంగా కోలాహలంగా బహుమతులు అందజేశారు. నాగండ్ల - సూదివారిపాలెం గ్రామాల మధ్య క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఎంపిడిఒ ఆర్‌వి రాజ్యలక్ష్మి విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలకు సర్పంచ్ కంచుగంటి పద్మ ఏర్పాట్లు చేసి విజేతలకు బహుమతులు, భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎ శ్రీనివాసరావు, నక్కలపాలెం సర్పంచ్ వేణుబాబు, నాగండ్ల, సూదివారిపాలెం కార్యదర్శులు పొదిలి వెంకటేశ్వర్లు, కె సోని ఝాన్సీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన దీవి మోహనకృష్ణ (28) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయన ఎలక్ట్రికల్ పనిచేస్తూ జీవిస్తుంటాడు. మూడు రోజుల క్రితం ఐలవరం నుండి వెల్లటూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతూ ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, టిడిపి నాయకులు సంతాపం ప్రకటించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పర్చూరు

నూతలపాడు ఆశ్రయ, ఇడుపులపాడు ఆసరా వృద్ధాశ్రమాల్లో అమెరికాలోని ఏకం సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ బలిజేపల్లి సాయిలక్ష్మి జ్ఞాపకార్థం 50మంది వృద్ధులకు శనివారం అన్న దానం చేశారు. దుప్పట్లు విజ్ఞాన్ స్కూలు విద్యార్థుల చేతుల మీదుగా అందజేశారు. భవిష్యత్ తరానికి చెందిన విద్యార్థులు తల్లి దండ్రుల బాధ్యత తీసుకుంటామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల ప్రస్తావన ఊసే లేదు

- సమావేశానికి అధికార వైసిపి కౌన్సిలర్లు దుమ్మా
- అరగంటలో ముగిసిన కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణ ప్రజల సమస్యలపై మాట్లాడే అవకాశం లేదు. పట్టణ అభివృద్ధిపై చర్చలు లేవు, సీజనల్ యాక్షన్ ప్లాన్ తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యలపై ప్రణాళికలేమీ పట్టించుకోలేదు. అజండాలోని అంశాలు, వాటిలో ఉన్న లోటుపాట్లు పరిశీలించాల్సిన చేయలేదు. అంతా ఏక పక్షంగా అధికార పార్టీ నేతలు అజండాలో పాస్ చేశారు. ఇదీ మున్సిపల్ కౌన్సిల్ తీరు. కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఉదయం 11గంటలకు కౌన్సిల్ సమావేశం జరగవలసి ఉండగా 12గంటలు దాటిన తర్వాత ప్రారంభమైంది. అజండాలో తెలిపిన విధంగా మున్సిపల్ అధికారులు కౌన్సిల్ సమావేశ మందిరంలోనికి చేరుకున్నారు. మరో 10నిమిషాలకు చైర్ పర్సన్, వైస్ చైర్మన్ కౌన్సిల్ హాల్లోకి వచ్చారు. పురపాలక సంఘంలోని 28వార్డుల్లో 26మంది అధికార పార్టీ సభ్యులు ఉండగా, ఇద్దరు ప్రతిపక్ష సభ్యులు ఉన్నారు. ప్రతి నెలా నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్లో అత్యధికంగా దుమ్మా కొడుతుండటం గమనార్హం. ఇంతలో అజండాలోని 48అంశాల్లో రెండు అంశాలు పోడియం వద్ద చదువుతున్న మున్సిపల్ ఉద్యోగిని వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్త ఆపమని సూచించి అజెండాలోని 48అంశాలను సభ్యులు ఆమోదించినట్లు ప్రకటించి టీ తాగేలోపే సమావేశం ముగిసిందని అన్నారు. ప్రతిపక్షం లేకపోతే ప్రేక్షక పాత్రేనని కొందరు కౌన్సిలర్లు పెదవి విరిచారు. చాయ్, బిస్కెట్లకోసం రావాలా అంటూ కౌన్సిల్ హాల్ నుండి సభ్యులు బయటకు వచ్చారు. కేవలం అరగంటలోనే సమావేశం ముగిసింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయ సారధి, డిఈ శివరామకృష్ణ, ఎఈ రోహిణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు, చైర్మన్ కట్ట మంగ

మెరుగైన పరిశోధనలతోనే లాభసాటి సేద్యం

ప్రజాశక్తి - బాపట్ల

కర్షక లోకం లాభసాటి సేద్యానికి వ్యవసాయ రంగంలో నిరంతర పరిశోధన ప్రక్రియ ఫలితాలతో ఉద్భవించిన రోబోటిక్ సేవలు అన్నదాతకు ఎంతో అవసరమని జాతీయ వ్యవసాయ ఇంజనీరింగ్ పరిశోధన స్థానం (భోపాల్) డైరెక్టర్ డాక్టర్ సిఆర్ మెహతా అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో వ్యవసాయంలో రోబోటిక్స్ ఆవిష్కరణ అనే అంశంపై ఒకరోజు జాతీయ సదస్సుకు ఆయన శనివారం హాజరయ్యారు. గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ ఇంజనీరింగ్ టెక్నాలజీ డీన్ ఎ మణి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో చోటు చేసుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల చెంతకు చేర్చాలని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు నూతన ఆవిష్కరణలతో హరిత విప్లవ సాధనకు కృషి జరిగితేనే రైతన్నకు వ్యవసాయంలో స్థిరమైన రాబడి లభిస్తుంది అన్నారు. విద్యావంతులైన యువతను వ్యవసాయం పట్ల ఆకర్షితులను చేయాల్సిన బాధ్యత నేటి శాస్త్రవేత్తలపై ఉందన్నారు. ఉద్యోగం, ఉపాధి కంటే వ్యవసాయం రెట్టింపు రాబడి తెచ్చిపెడుతుందన్న విశ్వాసం, నమ్మకాన్ని యువతలో కల్పించాలని అన్నారు. అందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రోబోటిక్ వంటి సాధనాలతో విత్తనం నాటే మొదలు పంట చేతికొచ్చే వరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తేనే దేశానికి ఆహార భద్రత సమకూరుతుందని అన్నారు. సదస్సులో పలువురు శాస్త్రవేత్తలు రోబోటిక్ పని విధానం వ్యవసాయానికి ఏ మేరకు దోహదపడుతుందనే అంశాలను వివరించారు. సదస్సులో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు జి కరుణాసాగర్, డిడి స్మిత్, ఐ శ్రీనివాస్, సి రమణ, కెవిఎస్ రామిరెడ్డి, బి హరిబాబు, జి వీరప్రసాద్, విజయ్ కుమార్, బి రాజ్ కిరణ్, ఎం మాధవ, లావణ్య, కృపావతి, విష్ణువర్ధన్, ఆర్ గణేష్ బాబు, రత్నరాజు పాల్గొన్నారు.



రోబోటిక్ సెమినార్‌లో వ్యవసాయ సాంకేతిక శాస్త్రవేత్తలు

మాకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే మద్దతు

ప్రజాశక్తి - బాపట్ల

అత్యధిక ఓటర్లు ఉన్న రెడ్డి సామాజికవర్గానికి అన్ని రాజకీయ పార్టీలు వచ్చే ఎన్నికల్లో బాపట్ల టికెట్ కేటాయించాలని రెడ్డి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జె కరుణాకరరెడ్డి కోరారు. పట్టణంలో యాత్రి నివాస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన శనివారం మాట్లాడారు. నియోజకవర్గంలో 36వేలకుపైగా రెడ్డి ఓటర్లు ఉన్నారని తెలిపారు. వగతంలో అనేకసార్లు బాపట్లలో రెడ్డి సామాజిక వర్గీయులు ఎమ్మెల్యేలుగా గెలిచినట్లు గుర్తు చేశారు. ఈసారైనా రెడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో 20అసెంబ్లీల్లో ఒరుగంటిరెడ్లు అత్యధిక శాతం ఉన్నారని అన్నా రు. అగ్రవర్ణ పేదలకు కల్పించిన 10శాతం రిజర్వేషన్ను పొందే దుకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్స్ జారీ చేసే నిబంధనలు సవరిం చాలని కోరారు. ఒరుగంటి రెడ్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఓసి రెడ్డి సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు జి గోవిందరెడ్డి, మోదుగుల బసవ పున్నారెడ్డి, కళ్లం హరినాధరెడ్డి, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, దుండి కనకారెడ్డి పాల్గొన్నారు.




రెడ్డి సంఘం అధ్యక్షులు కరుణాకరరెడ్డి

గొనసపూడిలో నాయకుల సందడి

ప్రజాశక్తి - ఇంకొల్లు

గొనసపూడి గ్రామానికి చెందిన యువ పారిశ్రామికవేత్త విక్రమ్ నారాయణరావు, సర్పంచ్ విక్రమ్ నారాయణదీప్తి, విక్రమ్ అజయ్ దంపతుల నూతన గృహప్రవేశానికి పలువురు నాయకులు సందడి చేశారు. స్థానిక ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు, చీరాల ఎంఎల్ఎ కరణం బలరామ కృష్ణమూర్తి, మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్ఎ విజయ్ కుమార్ పాల్గొని విక్రమ్ నారాయణ కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. నూతన సంవత్సరం సందర్భంగా 2రోజుల ముందే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి దీప్తి విక్రమ్ నారాయణ, చిన్నగంజాం, ఇంకొల్లు టిడిపి అధ్యక్షులు పొద వీరయ్య, నాయుడు హనుమంతరావు, బత్తుల శ్రీనివాసరావు, చిన్నగంజాం మాజీ జడ్పిటిసి యార్లగడ్డ లక్ష్మి పాల్గొన్నారు.




ఎంఎల్ఎ ఏలూరికి శాలువాతో సత్కారం

ఆసరా జాబితా విడుదల

ప్రజాశక్తి - చీరాల

అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట పంచాయితీ కార్యదర్శి బి రమేష్ బాబు కోరారు. ఆసరా లబ్ధిదారుల జాబితాను శనివారం సచివాలయం నోటీసు బోర్డులో ఉంచారు. ఈ సందర్భంగా కొత్తపేట క్లస్టర్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ కాకుమాను వెంకటస్వామి మాట్లాడుతు ఆసరా లబ్ధిదారుల జాబితాలో పేర్లను వెరిఫికేషన్ చేసుకోవచ్చని అన్నారు. సచివాలయం పరిధిలో 178గ్రూపుల్లోని 1743 లబ్ధిదారులకు రూ.1.28కోట్లు లబ్ధి చేకూరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్, విఒఎలు నాగదేవి, విజయలక్ష్మి, రత్నకుమారి పాల్గొన్నారు.



ఆసరా జాబితా విడుదల చేస్తున్న ఇఒ

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అమృతలూరు ప్రాజెక్టు భట్టిప్రోలు సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్‌గా పనిచేస్తున్న బి బేబీస్వర్ణలత అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమె కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కార్యకర్తలు తెలిపారు. ఆమె మృతి పట్ల సిడిపిఒ విజయలక్ష్మి, ఎంపిపి డివి లలిత కుమారి, జడ్పిటిసి టి ఉదయభాస్కరి, సర్పంచ్ దారా రవికిరణ్మయి సంతాపం వ్యక్తం చేశారు.

దోగిపర్తికి విజయభేరి అవార్డు

ప్రజాశక్తి - వేటపాలెం : బెస్ట్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా దోగిపర్తి బాలకృష్ణ విజయభేరి అవార్డు అందుకున్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ 2023విజయభేరి అవార్డ్స్ కార్యక్రమం విజయవాడ ఏ1 ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి అందజేశారు. దోగిపర్తి బాలకృష్ణ బెస్ట్ కోఆర్డినేటర్‌గా, బెస్ట్ డిస్ట్రిక్ట్ ఇంచార్జిగా చుండూరి సురేష్ పాల్గొన్నారు.

లైబ్రరీలో పోటీపరీక్షల పుస్తకాలు

ప్రజాశక్తి - బాపట్ల : యువత ఉన్నత చదువుకు అవసరమైన గ్రూప్ -1, గ్రూప్ -2 అభ్యాసనకు పుస్తకాలను స్థానిక శాఖా గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయ పాలకులు అంగలకుదురు శివాజీ గణేషన్ విలేకరులకు శనివారం తెలిపారు. గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్, జాయింట్ కలెక్టర్ రాజకుమారి గనియా ఆదేశాల మేరకు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె ఝాన్సీ ఎంతో విలువైన ఈపుస్తకాలను సరఫరాచేశారని తెలిపారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టిన జిల్లా అధికారులు ఎట్టకేలకు ఇంకొల్లు సర్పంచ్ ఏజర్ల ప్రసన్న సైమన్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ డిపిఒ దాసరి రాంబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధులు రు.1.71కోట్లు దుర్వినియోగం అయినట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. ఈ విషయమై సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు అందించి 2024 మార్చి 28వరకు సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేసి పూర్తి బాధ్యతలు ఎంపిడిఒకు అప్పగించినట్లు తెలిపారు. రికార్డులు తగులబెట్టిన కేసులో రిమాండ్‌లో ఉన్న అంగలకుదురు చైతన్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'ఆడుదాం'లో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - వేటపాలెం

ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో భాగంగా మండలంలోని అక్కయ్యపాలెం, పాపాయిపాలెం పంచాయతీలలో యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలలో 7జట్లు పాల్గొన్నాయి. క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలు మండల స్థాయి పోటీలకు ఎంపిక అవుతారని పంచాయతీ కార్యదర్శి పరిణం పూర్ణ కుమారి తెలిపారు.

యడ్లపల్లికి హనిమిరెడ్డి నివాళి

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని రాజీవ్ కాలనీకి చెందిన న్యాయవాది యడ్లపల్లి శ్రీనివాసరావు తండ్రి యడ్లపల్లి చెంచయ్య శనివారం మృతి చెందారు. చెంచయ్య మృతదేహానికి వైసిపి ఇన్చార్జ్ పి హనిమిరెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన వెంట బివి కృష్ణారెడ్డి, కోట శ్రీనివాసకుమార్, ఎర్రమోతు రమేష్, కౌన్సిలర్ సుధీర్ ఉన్నారు.

వాకర్స్ కోసం విద్యుత్ వసతి

ప్రజాశక్తి-పొదిలి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్లో రాత్రి వేళ, తెల్లవారు జామున వాకర్స్ నడవడానికి అవసరమైన విద్యుత్ సౌకర్యాన్ని మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి ఏర్పాటు చేశారు. ఆయన తన సొంత నిధులతో నూతన విద్యుత్ స్తంభాలు, బల్బులు ఏర్పాటు చేశారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు దోర్నాల వరలక్ష్మమ్మ ఇటీవల తెల్లవారు జామున వాకింగ్ చేస్తూ పాము కాటుకు గురైన విషయం తెలిసిందే. కార్యక్రమంలో మీగడ ఈశ్వరరెడ్డి, గుంటూరి పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పనితీరుపై మండిపాటు

ప్రజాశక్తి - కొండపి

కొండపి-1 సచివాలయం పనితీరుపై సచివాలయాల జిల్లా ప్రత్యేక అధికారి, డిఎల్‌డిఒ ఉషారాణి మండిపడ్డారు. కొండపిలోని సచివాలయంను ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డు బట్టి సిబ్బంది సక్రమంగా పనిచేయడంలేదని అన్నారు. ఒక్క రికార్డు కూడా సక్రమంగా లేదని అన్నారు. సచివాలయంలో సిబ్బంది కూడా లేరని అన్నారు. మరల వారంలో తాను వచ్చేటప్పటికి తీరును మార్చుకోవాలని సూచించారు. లేకపోతే కలెక్టరుకు ఫిర్యాదు చేస్తానని అన్నారు. మహిళా పోలీసు దగ్గర ఎటువంటి సమాచారం లేదని అన్నారు. వీరి పనితీరును ఎంపిడిఒ పరిశీలించాలని సూచించారు. మండలం కేంద్రమైన కొండపిలోనే ఈవిధంగా ఉంటే ఇతర సచివాలయాల్లో సిబ్బంది పనితీరు అర్థమవుతుందని అన్నారు. ఎంపిడిఒ వారంలోకి ఒక సారైన సచివాలయాలను విజిట్ చేయాలని సూచించారు.

విద్యతో ఉన్నత భవిష్యత్తు

ప్రజాశక్తి-కొండపి

విద్యార్థులు విలువతోకూడిన విద్య నభ్యశించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వైఎస్ ఎంపిపి కోటరాజు, బొక్కిసం సుబ్బారావు, ఆరికట్ల హరినారాయణ విద్యార్థులకు సూచించారు. స్థానిక కళాశాల్లో 46వ వార్షికోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మన జిల్లాలో కొండపి కళాశాల అంటే చాలా గుర్తింపు ఉందని అన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలలో మొదటి, రెండవ బహుమతులు మాదవి మెడికల్ షాపు యజమాని ఆరికట్ల వెంకటరావు అందచేశారు.

వేడుకలకు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - శింగరాయకొండ

శింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి మండల ప్రజలకు నూతన సంవత్సరం వేడుకలు సందర్భంగా నిబంధనలు పాటించాలని సీఐ దాచేపల్లి రంగనాథ్ కోరారు. ప్రజలకు అసౌకర్యం లేకుండా వేడుకలు చేసుకోవాలని కసూచించారు. మోటార్ సైకిల్ సైలెన్సర్లు తీసి రోడ్లపై హల్చల్ చేయుట, రోడ్లపై హారన్ కొట్టుకుంటూ, అతివేగంగా వాహనాలు నడిపిన చట్టపర మైన కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు వాహనాలు సీజ్ చేస్తామని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లి దండ్రులు శిక్షార్హులౌతారని హెచ్చరించారు.

పొదిలి : నూతన సంవత్సర వేడుకలకు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ వెంకటసైదులు అన్నారు.

ఎటిఎం మోడల్ పరిశీలన

ప్రజాశక్తి - శింగరాయకొండ

పాకల గ్రామంలో జువ్విగుంట అన్నమయ్య, టి ధనుంజయ వాటిపల్లి సామ్రాజ్యం ప్రకృతి వ్యవసాయ పద్ధతి ఎటిఎం మోడల్లో వేసిన ఆకుకూరలు, కూరగాయల పంటలను ఎపిఎం సాంబశివరావు ఆధ్వర్యంలో మండల సమాఖ్య ఓబీలు శనివారం పరిశీలించారు. ఎపిఎం సాంబశివరావు, సీసీ మల్లికార్జున, చింతలపూడి ఫణలక్ష్మి, అనం రామసుబ్బమ్మ, వరాన్ మాష్టాంబి, వడ్లపాటి ప్రియదర్శిని, పూసాల రాజేశ్వరి, విఓఎ మౌనికపాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం'

ప్రజాశక్తి - కొండపి

గ్రామీణ స్థాయిలో క్రీడా ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర అమలు చేస్తున్నారని డిఎల్‌డిఒ ఉషారాణి అన్నారు. వెన్నూరు, కొండపిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు శనివారం నిర్వహించారు. ఎంపిడిఒ రమణమూర్తి పాల్గొన్నారు.

శిల్పుల నైపుణ్య కేంద్రం ఏర్పాటుకు కృషి

● కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ● జవహర్‌రెడ్డి ఫొటోను అందజేసిన విశ్వబ్రాహ్మణులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

శిల్పుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్‌ను ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సింగరాయకొండకు చెందిన దారు శిల్పి ఆదిమూలం ఈశ్వరాచారి చెక్కిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఫొటోను కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్య శిక్షణా కేంద్రం ఏర్పాటుతో శిల్పుల నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగ పడుతుందని అన్నారు. కనిగిరిలో ఎంఎస్ఎంఇ 95/గ్రాంట్‌తో ఉడ్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌కి 50సెంట్స్ భూమిని కేటాయించాలని కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. ఇందుకు కలెక్టర్ సాను కూలంగా స్పందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుతారం శ్రీనివాసులు, కార్యదర్శి ఫణిదపు సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట బ్రహ్మేంద్ర కుమార్, దారు శిల్పి ఆదిమూలం ఈశ్వరాచారి, రాష్ట్ర కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మానందం ఉన్నారు.


జవహర్‌రెడ్డి ఫొటోను అందజేసిన విశ్వబ్రాహ్మణులు

అవకతవకలు గుర్తిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - కొండపి

మండలంలో జరగనున్న సామాజిక తనిఖీల్లో అవకతవకలు భయట పడితే సంబంధించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎన్ఆర్‌జిఎస్ విజిలెన్సు అధికారి ఝాన్సీరాణి హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఉపాధి సిబ్బంది, సామాజిక తనిఖీ బృందంతో కోఆర్డినేషన్ సమావేశం ఎపిడి పి వెంకటస్వామి అధ్యక్షతన నిర్వహించారు. 19పంచాయి తీల్లో రూ.9.80కోట్ల విలువైన పనులు జరిగాయని తెలిపారు. వాటికి సంబం ధించి విచారణ జరుగుతుందని తెలిపారు. ఆడిట్ సిబ్బం ది ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలించి సమగ్రమైన నివేదిక తయారు చేయాలని సూచించారు. పని ప్రదేశాల్లో ఆయా పనికి సంబంధించి బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. సామాజిక తనిఖీ బృందానికి టిఎలు, ఎఫ్ఎలు సహకరించాలని అన్నారు. తనిఖీ జరిగే సమయంలో టిఏలు గైర్హాజరైన ట్లయితే చర్యలు తప్పవని అన్నారు. ఎఫ్ఎకు బదులుగా మరొకరు హాజరైనా సహించేది లేదని హెచ్చరించారు. పనుల కు పాస్ఆర్డర్ లేకుండా నగదు చెల్లింపులు జరిగితే ఎపిఒకి, యంపిడిఒకి 33శాతం జరిమా న విధిస్తామని అన్నారు. చేసిన పనులకు సంబంధించిన ఫోటో లు తప్పనిసరిగా ఫైల్‌లో పొందపర్చాలని అన్నారు. ఫోటో లు లేని పనులను పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు.


ఎన్ఆర్‌జిఎస్ విజిలెన్సు అధికారి ఝాన్సీరాణి

ఇంతవరకు రికార్డు ఇవ్వలేదు : ఎస్ఆర్‌పి

సామాజిక తనిఖీ చేసేందుకు వచ్చిన తమకు ఇంతవరకు మండలానికి సంబంధించిన పనుల రికార్డులను ఎపిఒ అందించలేదని ఎస్ఆర్‌పి ఉన్నత అధికారుల ముందు తెలిపారు. తమకు 26నుంచి ఇప్పటికి వరకు రికార్డులు అప్పగించకపోవడంతో తనిఖీ చేయడానికి వీలులేక పోయిందని తెలిపారు. ఇప్పటికైన రికార్డు అప్పగిస్తే తమ పనులను వెంటనే మొదలు పెడతామని అన్నారు.

విద్యార్థినులు ఉత్తమ ప్రతిభతో రాణించాలి

ప్రజాశక్తి - టంగుటూరు

మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థినులు ప్రభుత్వం నిర్వహించే పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయికి ఎదగాలని ఎంఈఓ2 తన్నీరు బాలాజీ ఆకాంక్షించారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీలు శనివారం నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో జమ్ములపాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని డి సాహితీ, ఎం చంద్రిక, ఎంజెపి బాలికల పాఠశాల, కె నాగజ్యోతి జడ్పీ హెచ్ఎస్ ఆలకూరపాడు విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. వకృత్వ పోటీల్లో ఆలకూరపాడు జడ్పీహెచ్ఎస్ నుండి పి భార్గవి, వై నీహారిక, ఎస్ విష్ణువర్ధిని మూడు స్థానాల్లో నిలవగా, చిత్రలేఖనం పోటీలలో ఎంజెపి, టంగుటూరు బాలికల పాఠశాలల విద్యార్థినులు ఎస్‌కె జెస్సికా, యు అశ్విని, బి అభిషేక్ వరుస మూడు స్థానాల్లో నిలిచారు.


పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ బాలాజీ

టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి - శింగరాయకొండ

మహిళలకు అండగా టిడిపి ఉంటుందని కొండపి ఎంఎల్ఎ డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. స్థానిక బాలాజీ నగర్‌లో బాబు షురిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. చంద్రబాబు సిఎం అయిన వెంటనే మహిళలకు ఉచితంగా బస్సులో ప్రయాణంతోపాటు మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో వేల్పుల సింగయ్య, బీమకుర్తి కష్ణ, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, కల్లగుంట నరసింహ, పసుపులేటి వెంకట శేషు, మండలపు గాంధీ చౌదరి, చిగురుపాటి శేషగిరి, సుదర్శి ప్రసాదరావు, షేక్ సందని భాష, తెలుగు యువత అధ్యక్షులు షేక్ సనవుల్లాఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

మద్దిపాడు : బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం సందర్భంగా టీడీపీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రతి కుటుంబానికి వివరించాలని మాజీ ఎంఎల్ఎ బిఎన్ విజయ కుమార్ సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మండవ జయంత్‌బాబు అధ్యక్షతన క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలు, నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ ఆడక స్వాములు, క్లస్టర్ ఇంచార్జిలు దేవబత్తిన ప్రసాద్, పాటిబండ్ల అజయ్ బాబు, ఎంపీటీసీ అద్దేపల్లి భవానీ, మండవ గోపీచంద్, చింతల శ్రీను, ముత్యాల మురళి, దొప్పా శేషయ్య, మండవ శివానందరావు, అబ్బూరి శేషగిరిరావు, మారెళ్ళ హరికుమార్, నైనాల భావన్నారాయణ, రావి నరసింహారావు, రావి ఉమామహేశ్వరరావు, రెబ్బవరపు ప్రభాకర్, కడియాల రఘుబాబు, అన్నమనేని సుబ్బారావు, బోడపాటి రామకష్ణ, ఐటీడీపీ ప్రభుదాస్, అనిల్, నాగరాజు, దాసరి రమేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెడి శీలం

పార్టీని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - మద్దిపాడు

గ్రామ స్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని మాజీ కేంద్రమంత్రి జెడి శీలం కోరారు. నియోజకవర్గ స్థాయి సమావేశం మండలంలోని వెల్లంపల్లిలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా జెడి శీలం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రానున్న రోజుల్లో పూర్వ వైభవం వస్తుందని అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీని బలోపేతం చేస్తూ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కోరారు. మద్దిపాడు మండల అధ్యక్షులుగా వసంతరాయుడు, సంతనూతల పాడుకు ఎలమందరెడ్డి, నాగులుప్పలపాడుకు కె నాగేశ్వరరావు, చీమకుర్తికి తుమ్మల సుబ్బారావును అధ్యక్షులుగా ప్రకటించారు. పార్టీలోకి చేరిన వారికి జేడీ శీలం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశానికి వసంత రాయుడు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీపతి ప్రకాశం, రాష్ట్ర ప్రచార కార్యకర్త ఆదినారాయణ, బాపట్ల నియోజకవర్గ ఇన్చార్జి గంట అంజిబాబు, సంతనూతలపాడు నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకులు పులిపాటి రాఘవులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - మద్దిపాడు

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐఏఎస్ రామచంద్రుడు అన్నారు. మండలంలోని కొలసనకోట, వెల్లంపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన వికసిత్ భారత సంకల్పయాత్రలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణకోటిరెడ్డి, ఎండిఓ శ్రీనివాసరావు, తహశీల్దారు రజనీకుమారి, ఏపీఓ ధనుంజయ్ వర్మ, ఎపిఎం నరేంద్ర పాల్గొన్నారు.

కొండారెడ్డికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి-కొండపి

ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక స్వచ్ఛంద సంస్థల ద్వారా ఎంపిక చేసిన వారికి అనంతపురం జిల్లా రాయదుర్గంలో జాతీయ పురస్కార అవార్డులు శనివారం అందజేశారు. కొండపికి చెందిన శ్రీలక్ష్మీనరసింహ ట్రస్టు సేవలు చేసే వారిని గుర్తించి సత్కరించారు. యల్లావుల కొండారెడ్డికి జాతీయ పురస్కార అవార్డు అందచేశారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించారు. అవార్డు అందుకున్న కొండారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

పాపిరెడ్డి ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పొదిలి

మండలంలోని కుంచేపల్లి గ్రామానికి చెందిన పేరం పాపిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఎస్ఐ వెంకట సైదులు అన్నారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుంచేపల్లి వాలంటీర్ తాళ్లూరి సామ్యేల్‌కు సంస్థ ఛైర్మన్ పేరం సుబాష్ చంద్రబోస్‌రెడ్డి ట్రస్ట్ తరపున రూ.30వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గొలమారి చెన్నారెడ్డి, వైసిపి అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కె నూర్జహాన్ బేగం, గూడూరి వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసెఫ్, శానిటరీ ఇన్స్పెక్టర్ మారుతిరావు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎస్సీసెల్ అధ్యక్షుడు

ప్రజాశక్తి - కొండపి

మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఎస్సీసెల్ మండల అధ్యక్షులు గర్నెపూడి రమేష్ తాడేపల్లిలోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కొండపిలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించి తొందరల్లోనే అన్నింటినని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు రమేష్ తెలిపారు.

కోవిడ్ పట్ల జాగ్రత్తలు అవసరం..

డిఎంహెచ్ఒ విజయమ్మ

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్రవ్యాప్తంగా కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కోవిడ్ దరిచేరకుండా ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించి అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఎస్.విజయమ్మ శనివారం ప్రకటనలో తెలిపారు. శానిటైజర్ ఉపయోగించాలన్నారు. సాధ్యమైనంతవరకు ప్రయాణాలు తగ్గించుకోవాలని సూచించారు. జ్వరం, దగ్గు, న్యుమోనియా వంటి లక్షణాల బారిన పడితే తప్పనిసరిగా దగ్గరలోని కోవిడ్ సెంటర్‌కు వెళ్లి కరోనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. విదేశాల నుండి స్వదేశానికి వచ్చినవారు తప్పనిసరిగా కరోనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కోవిడ్ జాగ్రత్తలు తీసుకునేందుకు ప్రజలు వైద్య సిబ్బందిని, దగ్గరలోని కోవిడ్ పరీక్షా కేంద్రాలను సంప్రదించాలని విజయమ్మ తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జాతీయ ట్రెక్కింగ్ క్యాంపునకు ఎన్‌సిసి విద్యార్థులు

ప్రజాశక్తి-ఒంగోలు

పేర్నమిట్ట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు కేరళ రాష్ట్రం, ఇడుక్కి జిల్లా, కులమావులో ఈ నెల 22 నుంచి 29 వరకు నిర్వహించిన జాతీయ ట్రెక్కింగ్ క్యాంపును విజయవంతంగా ముగించారు. క్యాంపునకు వెళ్లిన వారిలో కె.శ్రీధర్, పి.హరీష్, టి.యశ్వంత్ ఉన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పార్వతీశాంతి, ఎన్‌సిసి ఆఫీసర్ బి.శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

తాత్కాలికంగా స్పందన రద్దు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఎవరూ ఇతర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కి సోమవారం రావద్దని ఆయన సూచించారు. జిల్లా ప్రజలందరికీ 2024 నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. రాగద్వేషాలు, భేదాభిప్రాయాలకు అతీతంగా అందరూ ఐక్యంగా అభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో 'నూతన' వేడుకలు: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతవంతమైన వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. శనివారం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడిపినా, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించినా ఉపేక్షించబోమని చెప్పారు. బాణాసంచా కాల్చడం, పరిమితికి మించిన ధ్వనితో డీజేలు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమన్నారు.

అర్హులందరికీ ఇళ్లు పంపిణీ చేస్తాం..

- రాబోయేది టిడిపి ప్రభుత్వమే..
- పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమని, త్వరలోనే అర్హులందరికీ ఇళ్లు పంపిణీ చేస్తామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు తెలిపారు. స్థానిక చింతల టిడ్కో గృహ నిర్మాణాల వద్ద లబ్ధిదారులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. తొలుత పలువురు లబ్ధిదారులు తాము బంగారం నగలు కుదువకు పెట్టి, వడ్డీలకు డబ్బులు తీసుకొని వాటా సొమ్ము కడితే నేటికి ఇళ్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు వడ్డీలు కడుతూ, మరో వైపు బ్యాంకుల నుంచి నోటీసులు అందుకొని ఇబ్బందులు పడుతున్నామని దామచర్ల జనార్ధన్‌రావు దృష్టికి తెచ్చారు. అనంతరం జరిగిన సభకు టిడిపి ఒంగోలు నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గత నాలుగున్నర ఏళ్లలో 30 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోవటం వారి అసమర్ధతకు నిదర్శనమన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఇప్పటి వరకు టిడ్కో ఇళ్లను ఒక్కసారైనా సందర్శించారా.? అని ప్రశ్నించారు. ఆయనకు ప్రజల బాధలు పట్టవని, ఒంగోలు నగరంలో ప్రతి రోజు తాగునీరు ఇస్తామని మోసం చేశారని, ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ 25 వేలు పట్టాలు ఇస్తామని మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే ఆయనతో చర్చించి అర్హులైన అందరికీ ఇళ్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మంత్రి శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వైవి సుబ్బారావు, ఏఎంసి మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు ప్రసంగించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టివి శ్రీరామమూర్తి, మేడికొండ మోహన్‌రావు, రావుల పద్మజ, తమ్మిశెట్టి రమాదేవి, నాళం నరసమ్మ, పసుపులేటి సునీత, కార్పొరేటర్లు దాచర్ల వెంకటరమణయ్య, తిప్పరమల్లి రవితేజ, అంబూరి శ్రీను పాల్గొన్నారు.

ఫిబ్రవరి నెలాఖరుకు టిడ్కో ఇళ్లు పంపిణీ

నగర మేయర్ గంగాడ సుజాత వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

2024 సంవత్సరం ఫిబ్రవరి నెలాఖరుకు నగరంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు. కొప్పోలు సమీపంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలను శనివారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ పనులు తుదిదశలో ఉన్నాయని వివరించారు. ఇళ్ల సముదాయాలకు అవసరమైన రోడ్లు, కాల్వలు, కరెంటు ఏర్పాటు పనులు కూడా జరుగుతున్నాయని చెప్పారు. టిడ్కో ఇళ్ల ప్రజలు నివసించేందుకు ఎంతో అనువుగా ఉన్నాయని, మరో రెండు మాసాల్లో అన్నీ వసతులు సమకూర్చి ఫిబ్రవరి నెలాఖరుకు లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని చెప్పారు. మేయర్ వెంట కార్పొరేటర్లు ఈదర వెంకట సురేష్‌బాబు, ఇమ్రాన్‌ఖాన్, యనమల నాగరాజు, గిరిజా శంకర్ శాండిల్య, చింతల్లి గోపిచంద్, వేణుగోపాలరావు, వైసిపి నాయకులు పసుపులేటి శ్రీను, పెద్దిరెడ్డి బాస్కర్‌రెడ్డి, మహిళా నాయకులు బైరెడ్డి అరుణ, ప్రమీలా, సువర్ణ పాల్గొన్నారు.


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న మేయర్ సుజాత

వంటావార్పుతో ఉద్యోగుల నిరసన

- పొర్లు దండాలు పెట్టిన ఉద్యోగులు
- 11వ రోజుకి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు సమగ్ర శిక్ష ఉద్యోగులు వంట వార్పుతో నిరసన తెలియజేశారు. పలువురు ఉద్యోగులు జగనన్న మా మొర ఆలకించన్న అంటూ పొర్లు దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లోని అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ జెఎసి ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె 11వ రోజుకి చేరుకుంది. శనివారం జరిగిన సమ్మెకు పుల్లలచెరువు జెఎసి నాయకులు డి. నాగేంద్రుడు అధ్యక్షత వహించారు. కెజిబివి ఐఇఆర్‌పిలకు ఇచ్చిన షో కాజ్ నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని వాటిని నోటీసులను దహనం చేశారు. లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ మహమ్మద్ రఫీ మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో జెఎసి జిల్లా ప్రధాన కార్యదర్శి యు.కళ్యాణి, జెఎసి ట్రెజరర్ సైదా, అన్ని విభాగాల సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ, శానిటరీ సిబ్బందికి

అన్ని రాయితీలూ వర్తింపజేయాలి

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్


ప్రజాశక్తి-ఒంగోలు

ఎంఒయు నిబంధనల ప్రకారం జిజిహెచ్‌లో సెక్యూరిటీ, శానిటరీ స్టాఫ్‌కు అన్ని రకాల రాయితీలు వర్తింప చెయ్యాలని, ఈ మేరకు యాజమాన్యంతో సంప్రదించి సమగ్ర వివరాలతో రావాలని ఏజిఐఎల్‌ఇ యాజమాన్యాన్ని జిజిహెచ్ సూపరింటెండెంట్ డా భగవాన్‌నాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ బాలాజీనాయక్, సిఎస్ ఆర్ఎంఒ డా బి.తిరుమలరావు సూచించారు. లేబర్ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుల సంక్షేమ లో కార్మికులతో జిజిహెచ్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి భగవాన్ నాయక్, బి.తిరుమల రావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు డా ప్రభాకర్ రావు, డా బాలాజీ నాయక్, సభ్యులు బెంజ్మన్, కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేతనాలు, సౌకర్యాలు, సంబంధించి పలు సమస్యలని సిబ్బంది సమావేశం దష్టికి తీసుకు వచ్చారు. ఐడి కార్డ్స్, యూనిఫాం, హెల్త్ సర్వీసెస్ సకాలంలో అందించాలని యాజమాన్యానికి సూపరింటెండెంట్ సూచించారు.


మాట్లాడుతున్న భగవాన్‌నాయక్

పోరుబాటలో కార్మికులు

ప్రస్తుతం సమ్మెల కాలం నడుస్తోంది. చాలాకాలంగా తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వానికి విన్నపాలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు సమ్మెబాట పట్టారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 19వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకు రాష్ట్రప్రభుత్వం ఎన్ని అవరోధాలు కల్పించినా అంగన్‌వాడీల నిరవధిక సమ్మె కొనసాగుతుందని యూనియన్ నేతలు స్పష్టం చేస్తున్నారు. మరో వైపు మున్సిపల్ కార్మికులూ సమ్మె బాట పట్టారు. మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులు ఎక్కువ శాతం బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే.. కోవిడ్ కార్మికులకు నాలుగు నెలల నుంచి జీతాలు లేకపోగా, కనీసం క్రిస్మస్ పండుగకు కూడా జీతాలు ఇవ్వకుండా ఇప్పుడు పోటీ కార్మికులను తెచ్చి వారికి రూ.700 చెక్కుల రూపంలో ఇస్తున్నారని, ఇలా పోటీ కార్మికుల తీసుకొచ్చి డబ్బులు ఇవ్వటం సరికాదని కార్మికులంటున్నారు. ప్రజలను తప్పుదారి పట్టించి కార్మికులను రెచ్చగొట్టే విధానాలను రాష్ట్రప్రభుత్వం మానుకోవాలని, ఈ నెలాఖరు నుంచి సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.



ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో వైసిపి తరపున రానున్న ఎన్నికల్లో ఎవరు పోటీ చేస్తున్నారనే విషయమై సందిగ్ధం కొనసాగుతోంది. గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలని భావిస్తున్న వైసిపి అధినేత జగన్ ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని పలు నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలను మార్చారు. ఈ మేరకు మొదటి విడతలో అద్దంకి, వేమూరు, రేపల్లే, కొండపి, సంతనూతలపాడు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల వైసిపి ఇన్‌ఛార్జిలను మార్చారు. మంత్రులుగా ఉన్న ఆదిమూలపు సురేష్‌ను ఎర్రగొండపాలెం నుంచి కొండపికి, మేరుగు నాగార్జునను వేమూరు నుంచి సంతనూతలపాడు ఇన్‌ఛార్జిగా మార్చారు. అద్దంకి నుంచి పార్టీ ఇన్‌ఛార్జిగా నిన్నటివరకు వ్యవహరించిన బాచిన కృష్ణచైతన్య స్థానంలో పాణెం హనిమిరెడ్డి పేరును ప్రకటించారు. కానీ కృష్ణచైతన్య తానే ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు. వేరుకుంపటి పెట్టారు. కొండపి నుంచి వరికూటి అశోక్‌బాబును వేమూరుకు ఇన్‌ఛార్జిగా పంపారు. ఇక్కడకు మంత్రి మేరుగు నాగార్జున వచ్చి కొత్త ఇన్‌ఛార్జిని పరిచయం చేశారు. నియోజకవర్గానికి పూర్తిగా కొత్త అయిన అశోక్‌బాబు స్థానిక నేతలతో కలిసి గ్రామాల్లో పర్యటించే కార్యక్రమానికి పూనుకున్నారు. రేపల్లె నియోజకవర్గంలో పార్టీ ఇన్‌ఛార్జిగా ఉన్న మోపిదేవి వెంకటరమణను తప్పించి డాక్టర్ ఈవూరు గణేష్‌ను ఇన్‌ఛార్జిగా తెచ్చారు. ఇక్కడ కూడా వైసిపి నేతల్లో ఈ నిర్ణయం అలజడి తెచ్చింది. మోపిదేవికి టిక్కెట్ ఇవ్వకపోతే రాష్ట్రంలో ఉన్న మత్స్యకారులు రానున్న ఎన్నికల్లో వైసిపికి వ్యతిరేకంగా ఓటు వేయడం జరుగుతుందని సంఘం నేతలు హెచ్చరించారు. పర్చూరులో అక్కడ ఉన్న ఇన్‌ఛార్జికి వ్యతిరేకంగా అసమ్మతివాదులు పావులు కదుపుతున్నారు. బాపట్ల నుంచి వైసిపి అభ్యర్థిగా కోన రఘుపతి ఖరారయ్యారు. కానీ రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు కోనను వ్యతిరేకిస్తూ ప్రకటనలు ఇస్తున్నారు. రాజీనామాలకు సిద్ధమవుతున్నారు. ఒంగోలు నుంచి వైసిపి అభ్యర్థి ఎవరు అనేది స్పష్టం కాలేదు. గిద్దలూరు, మార్కాపురం కూడా పెండింగ్ లో ఉన్నాయి.

తుపాను కారణంగా భారీవర్షాలతో రైతులకు కోలుకోలేని రీతిలో నష్టపోయారు. జిల్లాలో వివిధ పంటలు నీట మునిగి 3,33,300 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 1,98,535 ఎకరాల్లో వరిపైరుకు, మొక్కజొన్న, శనగ, మినుము, పొగాకు, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ పలు ఇతర రకాల పంటలకు 1,34,765 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. నష్టం జరిగిన వ్యవసాయ పంటలకు రూ.149 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రతిపాదనలు పంపారు. దీంతో పాటు జిల్లాలో 20,223 ఎకరాల్లో ఉద్యానవన పంటలైన మిరప, అరటి, పసుపు, పండ్లతోటలు, పూల తోటల రైతులు నష్టపోయారు. రూ.14 కోట్ల 64 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రతిపాదనలు పంపారు. కానీ నేటికీ రాష్ట్రప్రభుత్వం నుంచి ఎలాంటి పంట సాయం విడుదలవుతున్న దాఖలాలు లేవు.

బాపట్ల నుంచి ఎగువ ప్రాంతంలోని రైతులు తుపాను కారణంగా కరిసిన వర్షాలతో ఇబ్బందులు పడ్డారు. పంటలను నష్టపోయారు. గత కొద్ది రోజులుగా బాపట్ల దిగువన కుంకలమర్రు నుంచి కారంచేడు, వేటపాలెం, చినగంజాం ప్రాంతాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో వరిపైరు సాగుచేసిన రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కొమ్మమూరు కాలువ పరిధిలో రైతులు ఖరీఫ్‌లో అలస్యంగా వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి పైరు పొట్టదశలో కొంత, కోతకు వచ్చే దశలో కొంత ఉంది. తుపాను కారణంగా కొమ్మమూరు కాలువకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. నీటి సరఫరా తగ్గిపోయింది. కాలువ ద్వారా సాగునీరు రావాలం టే మరమ్మత్తులు కూడా చేయాల్సి ఉంది. అది జరగలేదు. రైతులు ఆయిల్ ఇంజన్లు పెట్టి వరి పొలాలకు నీరు అందే ఏర్పాటు చేసుకుంటున్నారు. కొమ్మమూరు కాలువకు నీరు విడుదల కాకపోతే కొన్ని రోజులు తరువాత ఇంజన్ల ద్వారా కూడా వరి పొలాలకు సాగు నీరు అందే పరిస్థితి ఉండదు. రైతుల చేతికి పంట రావాలంటే కొమ్మమూరు ద్వారా నీరు విడుదల చెయ్యాలి.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా